
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 6 ఆగస్టు 2025

హామీలు నెరవేరుస్తున్నాం..

- అభివృద్ధి చేస్తున్నాం.. నిండు మనసుతో ఆశీర్వదించండి
- ప్రతీ ఎకరానికి సాగు నీరందించే లక్ష్యంతో ముందుకు..
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కలెక్టర్ అనుదీప్‌తో కలిసి తిరుమలాయపాలెంలో పర్యటన

7



తిరుమలాయపాలెంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విధుల్లో నిర్లక్ష్యం.. తప్పుడు హాజరు..

బోనకల్ మండలంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ ఆదేశాలతో విచారణ
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

బోనకల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా తప్పుడు హాజరుతో విధులు నిర్వర్తిస్తున్న బోనకల్ మండలంలోని తూటికుంట్ల, ఆళ్లపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో బాగంగా ప్రతిరోజు ఉదయం పది గంటల లోపు శానిటేషన్ రిపోర్ట్(డీఎస్ఆర్) యాప్‌లో ముఖ హాజరు తీసుకోవాలి. యాప్‌లో గ్రామ పంచాయతీకి సంబంధించి పనుల సమాచారం ఉంటుంది. పనులను పర్యవేక్షణ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. గ్రామ పంచాయతీకి రాకుండానే పాస్ ఫొటోలను అక్కడ మల్టీ పర్పస్ వర్కర్లకు అందుబాటులో ఉంచి వారితోనే ఫోటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నారు. యాప్‌లో హాజరుకు సంబంధించి రాష్ట్ర పంచాయతీ డైరెక్టర్ శ్రీజన ర్యాండమ్‌గా పర్యవేక్షణ చేసే క్రమంలో ఖమ్మం జిల్లా బోనకల్ మండలం పై దృష్టి సారించారు. ఆళ్లపాడు, తూటికుంట్ల పంచాయతీ కార్యదర్శులు మల్లారపు శ్రీనివాసరావు, బక్క సురేష్‌లు నేరుగా యాప్ ద్వారా హాజరు వేసుకోకుండా, పాస్ ఫొటోలతో వేరే వ్యక్తులతో హాజరు నమోదు చేస్తున్నారని గుర్తించారు. దీనిపై సమగ్ర విచారణ చేసిన తరువాత తప్పుడు హాజరుకు పాల్పడినట్లు ఇద్దరు కార్యదర్శులను గుర్తించడంతో వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఆదేశించారు. దీంతో కలెక్టర్ ఇద్దరు కార్యదర్శులను సస్పెండ్ చేశారు.

ప్రాణాలను.. మింగేస్తున్నాయ్!



మృత్యు గుండాలుగా మారుతున్న జలవనరులు

- ఉమ్మడి జిల్లాలో వరుస నీటి ప్రమాదాలు
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ప్రాణాలు కోల్పోయిన వారు 64మంది..
- కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్న ఘటనలు
- ఉసురు తీస్తున్న ఈత, చేపల వేట
- పుణ్య స్నానాలకు గోదావరిలో దిగి కొందరు మృత్యువాత

ఖమ్మం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

చెరువులు.. కుంటలు.. వాగులు.. సాగునీటి కాలువలు.. ప్రాణాలు మింగేస్తున్నాయి. చివరకు పుణ్యస్నానాలకు గోదావరిలోకి దిగిన భక్తుల్లో కొందరు అసువులు బాస్తున్న సంఘటనలు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగులుస్తున్నాయి. ఇటీవల ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న వరుస సంఘటనలు బెంబేలెత్తిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ వర్షాకాలంలో ఈ నీటి ప్రమాదాలు రోజుకోచోట జరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 64 మంది ప్రాణాలు కోల్పోగా.. ఖమ్మం జిల్లాలో 45మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 19మంది మృత్యువాత పడ్డారు. ఖమ్మంలో మున్నేరు, ఎన్నెస్పీ కాలువలకు ఈత నేర్చుకొనేందుకు వెళుతున్న వారిలో ప్రాణాలు కోల్పోతున్న వారుంటే.. మున్నేరు, కిన్నెరసానితో పాటు పలు వాగులు, చెరువుల్లో చేపలు పట్టేందుకు వెళుతున్న వారు మరికొందరు అసువులు బాస్తున్నారు. అయితే చాలా ప్రమాదాలకు ఇసుక తవ్వకాలు జరిగినప్పుడు ఏర్పడిన పెద్దపెద్ద గోతులే కారణంగా కనిపిస్తున్నాయి. ఆ గోతులు లోతు అంచనా వేయలేక అందులో పడి ప్రాణాలు కోల్పోతున్నారు.

- ఖమ్మం జిల్లా చింతకాని మండలం ఇటీవల రెండు, మూడు రోజుల వ్యవధిలో ఐదుగురు చనిపోగా నాగులవంచలో ఆదివారం సోదరులు కంభం నాగేశ్వరరావు, సత్యం తాము లీజుకు

(.. మిగతా 6వ పేజీలో)



ఈ నెల 3న చింతకాని మండలంలో జరిగిన రెండు నీటి ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. నాగులవంచ గ్రామానికి చెందిన రైతు తోటకూరి జగన్ (33).. చెరువులోకి వెళ్లిన పశువులను బయటకు తీసుకొచ్చేందుకు దిగి.. నీట మునిగి మృతి చెందాడు. అలాగే అదే రోజు.. అదే గ్రామానికి చెందిన కంభం నాగేశ్వరరావు, ఆయన సోదరుడు సత్యం తాము లీజుకు తీసుకున్న చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి ఇద్దరూ మృతి చెందారు.



వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం అర్డాస్ పల్లికి చెందిన పత్తి హరిప్రసాద్ కుటుంబ సభ్యులు ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం రేగులచెలకకు చెందిన బంధువు రేపాకుల పవన్ కుమార్ కుటుంబంతో కలిసి ఈ ఏడాది ఫిబ్రవరి 28న భద్రాద్రి రామయ్య దర్శనానికి వచ్చారు. గోదావరిలో స్నానం చేసేందుకు దిగగా హరిప్రసాద్ (21), పవన్‌కుమార్ (22)తో పాటు హరిప్రసాద్ తండ్రి నర్సింహులు మునిగారు. వారిలో గజఈతగాళ్లు నర్సింహులును కాపాడగా.. హరిప్రసాద్, పవన్‌కుమార్ కన్నుమూశారు. దీంతో దైవదర్శనానికి వచ్చిన ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.

తెగుళ్లకు సెలైన్ ట్రీట్మెంట్

- ఆయిల్‌పామ్ యాజమాన్యంలో వినూత్న పద్ధతి
- అవలంబిస్తున్న ఉద్యానశాఖ అధికారులు
- కొణిజర్ల మండలం లాలాపురంలో తొలిసారి అమలు
- మలేషియా, ఇండోనేషియాలోని సాగు విధానమే ఆదర్శం

వివరాలు 7లో



ఆయిల్‌పామ్ చెట్టుకు సెలైన్ బాటిల్ అమర్చుతున్న ఉద్యానఅధికారి

అవినీతికి చెక్ పెట్టారు..

ఆదాయాన్ని పెంచారు!

- భద్రాద్రి దేవస్థాన పాలనలో పారదర్శకతకు పెద్దపీట
- స్వామివారి సేవలకు చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లోనే..
- విరాళాలు మొదలు.. విక్రయాల వరకూ డిజిటల్‌లోనే లావాదేవీలు
- మూడేళ్లలో రూ.80 కోట్లకు పెరిగిన ఆదాయం
- రామాలయ అభివృద్ధిపై ఈవో రమాదేవి మార్క్

6





మరో ఐదుగురికి అస్వస్థత

- కల్లూరు గిరిజన ఆశ్రమ విద్యార్థినుల్లో భయం భయం
- ఇంటి బాట పట్టిన స్టూడెంట్స్
- వసతి గృహ సంక్షేమ అధికారిపై సస్పెన్షన్ వేటు



కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

కల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఉడికీ ఉడకని కిచిడీ తిని సోమవారం ఖమ్మం జిల్లా కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహ విద్యార్థినులు 37మంది అస్వస్థతకు గురై కోలుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటన గురించి తేరుకోకముందే మంగళవారం ఉదయం అల్పాహారంగా ఇడ్లీ తిన్న మరో విద్యార్థినుల్లో ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందారు. అయితే సోమవారం నాటి ఘటనతో ఆందోళనకు గురైన విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాలకు తరలి రాగా..

(.. మిగతా 6వ పేజీలో)

మెనూ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- హాస్టళ్ల విద్యార్థుల సంక్షేమంపై శ్రద్ధ వహించాలి
- వసతి గృహాల అధికారులతో ఐటీడీఏ పీవో రాహుల్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాల, పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్, గురుకులాలు, ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు సరఫరా చేసే మెనూ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో బి రాహుల్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఖమ్మం కలెక్టరేట్‌లో గిరిజనశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్పాహారం, భోజనాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కల్లూరు గిరిజన సంక్షేమశాఖ పాఠశాలలో జరిగిన పరిణామాలు

(.. మిగతా 6వ పేజీలో)



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో బి రాహుల్



వైరా రిజర్వాయర్‌లో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు

నిషేధం ఉన్నా..

- వైరా రిజర్వాయర్‌లో ఆగని చేపల వేట
- మత్స్యశాఖ అధికారి ఆదేశాలు బేఖాతరు

వైరా, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వైరా రిజర్వాయర్‌లో చేపల వేటను నిలుపుదల చేస్తూ జిల్లా మత్స్యశాఖ అధికారి జారీ చేసిన ఆదేశాలను కొందరు మత్స్యకారులు బేఖాతరు చేస్తున్నారు. ఎప్పటిమాదిరిగానే చేపల వేట కొనసాగిస్తున్నారు. రిజర్వాయర్‌లో చేపల వేటను నిలిపేస్తూ గత నెల ఒకటోతేదీన జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి జి.శివప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. చేపల పునరోత్పత్తి కాలం జూన్ నుంచి ఆగస్టు చివరి వరకు ఉంటుందని ఈ సమయంలో నిబంధనల ప్రకారం రిజర్వాయర్‌లో చేపల వేటను నిషేధిస్తున్నామని ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు. ఆమేరకు వైరా మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి ప్రతులు అందజేశారు. ఈ మూడునెలల కాలంలో మత్స్యకారులు ఎవరూ కూడా రిజర్వాయర్‌లో వలలు, బుట్టలు వేయకుండా సహకరించాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు. అతిక్రమించి చేపల వేట చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోకుండా కొందరు మత్స్యకారులు చేపల వేట కొనసాగిస్తున్నారు. వైరా రిజర్వాయర్ పరిధిలో వైరా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉంది. ఈ సంఘం పరిధిలో వైరా, కొణిజర్ల, తల్లాడ మండలాల్లోని 11గ్రామాలకు చెందిన దాదాపు 1,200మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధ ఉత్తర్వులను వైరా, కొణిజర్ల పోలీస్‌స్టేషన్లలో అలాగే వైరా మునిసిపాలిటీతోపాటు మూడు మండలాల్లోని గ్రామపంచాయతీల కార్యదర్శులకు అందజేశారు. అయినా ఈ ఆదేశాలను కొందరు మత్స్యకారులు పట్టించుకోకుండా చేపల వేట కొనసాగిస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా మత్స్యశాఖ అధికారి జి.శివప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా చేపల వేట నిలిపివేస్తూ తాము వైరా చేపల సొసైటీ అధ్యక్షుడికి, రెండు పోలీస్‌స్టేషన్లకు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఉత్తర్వులు ఇచ్చామని తెలిపారు. కొంతమంది సభ్యులు చేపల వేట కొనసాగిస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని దీనిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రామాలయంలో పవిత్రాధివాసం

నేడు రామయ్యకు స్నపనం, పవిత్రారోపణం

భద్రాచలం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రాత్సవాల్లో భాగంగా మంగళవారం పవిత్రాధివాసం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్రాలకు అధివాసం చేసి శ్రీ సీతారామచంద్రస్వామిని అందులోకి ఆవాహన గావించి పవిత్రాధివాసం నిర్వహించారు. అంతకుముందు విశ్వక్సేనపూజ, పుణ్యావచనం, అగ్నిప్రతిష్ఠ, చతుస్థానార్చానం, బింబం, కుంభం, మండలం తదితర కార్యక్రమాలను సంప్రదాయ బద్ధంగా జరిపారు. సాయంత్రం యాగశాలకు పవిత్రాలను తీసుకొచ్చి పూజలు చేశారు. సోమవారం రాత్రి పవిత్రోత్సవాలకు అంకురార్పణ గావించగా.. మొత్తం ఐదు రోజులపాటు కన్నుల పండువగా ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. బుధవారం శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి ప్రత్యేక స్నపనం నిర్వహించి ఆలయంలో ఉండే ధ్రువమూర్తుల నుంచి ప్రతీ దేవతామూర్తికి, ఆలయ శిఖరాలకు పవిత్రాలను ధరింప చేస్తారు. ఇదిలా ఉండగా.. పవిత్రోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు నిత్య కల్యాణాలతో పాటు పవళింపు సేవలను నిలిపివేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామనుజాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు తదితర వైదిక సిబ్బందితో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యావత్ దేశం చూసేలా..

పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

7





అవినీతికి చెక్ పెట్టారు.. ఆదాయాన్ని పెంచారు!



ఈవో రమాదేవి

- భద్రాద్రి దేవస్థాన పాలనలో పారదర్శకతకు పెద్దపీట
- స్వామివారి సేవలకు చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లోనే..
- విరాళాలు మొదలు.. విక్రయాల వరకూ డిజిటల్ లావాదేవీలు
- మూడేళ్లలో రూ.80కోట్లకు పెరిగిన ఆదాయం
- రామాలయ అభివృద్ధిపై ఈవో రమాదేవి మార్క్

భద్రాచలం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంపై గతంలో అవినీతి నీడలు వినిపించేవి. ఆదాయ వ్యయాల లెక్కలు సహా పలు కార్యక్రమాల నిర్వహణపై తరచూ విమర్శలు వినిపించేవి. ఇక వచ్చే ఆదాయానికి.. ఖర్చులకు సంబంధం లేకుండా పోయేది. ఇక కరోనా సమయంలో అయితే డిపాజిట్లను సైతం బయటకు తీశారు. అలాంటి గడ్డు పరిస్థితుల నుంచి క్రమంగా బయటపడింది దేవస్థానం. డిప్యూటీ కలెక్టర్ ర్యాంకు అధికారి అయిన ఎల్.రమాదేవి 2023 ఫిబ్రవరి 16 ఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఆమె తీసుకున్న పలు నిర్ణయాల కారణంగా 2022లో రూ.55కోట్లు ఉన్న ఆదాయం ప్రస్తుతం రూ.80 కోట్లకు చేరింది. ఆలయ ఆదాయ వృద్ధే లక్ష్యంగా అనేక మార్పులు చేసిన ఆమె.. పాలన సిబ్బంది పనితీరును గాడిలో పెడుతూనే అవినీతి, అవకతవకలకు పాల్పడిన పలువురిపై వేటు వేశారు. సిబ్బంది పనితీరు ప్రామాణికంగా అంతర్గత బదిలీలు చేయడంతో.. సిబ్బంది కూడా విధినిర్వహణలో అంకితభావాన్ని పెంచుకున్నారు.

రూ.80 కోట్లకు చేరిన ఆలయ వార్షిక ఆదాయం

దేవస్థానం ప్రస్తుత వార్షిక ఆదాయం రూ.80కోట్లకు చేరింది. ఈవోగా రమాదేవి బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆర్జిత సేవలన్నీ ఆన్‌లైన్ చేయడంతో పాటు వసతి గదులను పెంచడం, దుకాణాల లీజులతో పాటు టెండర్ల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తుండటంతో దేవస్థానానికి ఆదాయం అనూహ్యంగా పెరిగింది. 2022లో సుమారు రూ.55కోట్ల మేర ఉన్న ఆదాయం, 2024న వార్షిక లెక్కల ప్రకారం రూ.80కోట్ల మేర వార్షిక ఆదాయం ఉన్నట్లు దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో ఏ ఆలయంలో లేని విధంగా రామయ్య జరిగే సేవలన్నీ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోకి



కియోస్క్‌ల ద్వారా టికెట్లు పొందుతున్న భక్తులు

తెచ్చారు ఈవో రమాదేవి. భద్రాద్రి టెంపుల్ యాప్‌లో, భద్రాద్రిటెంపుల్.తెలంగాణ వెబ్‌సైట్లో ఆర్జిత సేవలు, వసతి గదుల బుకింగ్ చేసుకునే సౌకర్యం అందుబాటులోకి తెచ్చారు. దీంతో భక్తుల్లో 60 శాతం మంది వరకు ముందుగానే బుక్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదాయం గతంలో కంటే అనూహ్యంగా పెరిగింది. అన్ని కౌంటర్లలో కంప్యూటర్ ఆధారిత టికెట్ విధానం ప్రవేశపెట్టారు. భక్తులు ఈ-కానుక విధానంలో తమ స్మార్ట్‌ఫోన్ ద్వారానే కానుకలను సమర్పించే విధానాన్ని ప్రవేశపెట్టారు. అలాగే కియోస్క్ సేవల ద్వారా భక్తులు ఆలయ పరిసరాల్లో నేరుగా స్కాన్ చేసి దర్శనం, ప్రసాదం, అర్చన టికెట్లు పొందే వెసులుబాటు కల్పించారు. వస్త్రాల సమర్పణ సమయంలో బార్‌కోడింగ్, అన్నదానానికి ఈ-టోకెన్ల జారీ, దేవస్థానంలో ఈ ఆఫీసు అమల్లో భాగంగా ఫైనాన్షియల్ మాడ్యుల్‌ను ప్రారంభించారు. త్వరలోనే స్టోర్స్ విభాగంలోనూ మాడ్యుల్‌ను రూపొందించేందుకు చర్యలు చేపట్టారు.

దాతల ద్వారా విరాళాల సేకరణకు పెద్దపీట

ఆలయాలకు ప్రధాన ఆదాయ మార్గాల్లో ఒకటైన దాతల ద్వారా రామాలయ అభివృద్ధికి విరాళాల సేకరణకు పెద్ద పీట వేశారు ఈవో రమాదేవి. జీఎంఆర్ గ్రూప్ సహకారంతో రామాలయానికి రెండు వైపులా భక్తులు నడిచేందుకు రూ.కోటితో షెడ్లను నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. దాతల సహకారంతో పలుచోట్ల తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. స్వామి వారికి అందజేసే బంగారు, ఆభరణాలకు సంబంధించి ఫోటో ఆల్బంను రూపొందించారు.

రామయ్య భూముల రక్షణకు కృషి..

ఏపీలోని పురుషోత్తపట్నంలో భద్రాచలం సీతారామచంద్రస్వామి వారికి ఉన్న సుమారు 889.5 ఎకరాల భూముల రక్షణ విషయంలో ఈవో రమాదేవి విశేష కృషి చేశారు. గత రెండేళ్లలో పలు చోట్ల అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంతో ఈ అంశం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యను ఎలాగైనా పరిష్కరించుకునేందుకు అడుగులు కూడా పడ్డాయి. ఒక దశలో ఈవో రమాదేవిపై ఆక్రమణదారులు దాడి చేసినా వెనుకంజ వేయకుండా ఆమె ఆక్రమణలను అడ్డుకోవడంలో తనదైన మార్క్ ప్రదర్శించారు.

గోశాల నిర్మాణానికి ప్రత్యేక కృషి

దేవస్థానం ఈవోగా రమాదేవి బాధ్యతలు చేపట్టకముందు సూపర్‌బజారు సెంటర్లో చిన్న గోశాలలో సుమారు 30 వరకు గోవులుండేవి. వాటి నుంచి సేకరించే పాలను రామాలయంలో ఉపయోగించే వారు. ఈవో రమాదేవి గోశాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టి ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్న రామాలయ భూముల్లో దాతల సహకారంతో నాలుగు గోవుల షెడ్లను ఏర్పాటు చేశారు. గో సంరక్షణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించారు.



దాతల సహకారంతో నిర్మించిన గోశాల షెడ్‌ను ప్రారంభించిన ఈవో రమాదేవి (ఫైల్)

భద్రాద్రి ఫొటోగ్రాఫర్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు

ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపిక

భద్రాచలం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతిక కమిషన్ ఏపీ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇండియన్ ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా వారు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన జాతీయ ఫొటో ఎగ్జిబిషన్‌లో భద్రాద్రి ఫొటోగ్రాఫర్ ఎస్కే షరీఫ్ మరోసారి జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. ఆయన గిరిజనుల సంప్రదాయ శైలిపై తీసిన ఫొటో ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ 2025కు ఎంపికైంది. ఈ క్రమంలో ఈ అవార్డుకు తన ఫొటో ఎంపికవడం పట్ల క్లాసిక్ షరీఫ్ సంతోషం వ్యక్తం చేశారు. కాగా పట్టణ పుర ప్రముఖులు పలువురు ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు.



అవార్డుకు ఎంపికైన చిత్రం

విద్యుత్ రంగ కార్మికుల కోసం పోరాటానికైనా సిద్ధం!

ఆర్టిజన్ కార్మికులను కన్వెన్షన్ చేయకుంటే సమ్మె

టీజీయూఈఈయూ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌రావు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఈశ్వర్‌రావు

భద్రాచలం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులను అర్హతను బట్టి కన్వెన్షన్ చేయాలని లేనిపక్షంలో కార్మికుల పక్షాన సమరశీల పోరాటాలకు సిద్ధంగా ఉండాలని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు అన్నారు. భద్రాచలంలో మంగళవారం జరిగిన టీజీయూఈఈయూ జిల్లా సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రోజు రోజుకీ వినియోగదారుల సంఖ్య పెరుగుతుందని, సర్వీసులకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్య మాత్రం పెరగడం లేదన్నారు. ఈ ప్రభావంతో ఆర్టిజన్ కార్మికులతో పాటు శాశ్వత ఉద్యోగులపై కూడా పని భారం విపరీతంగా పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యపై గత పది నెలలుగా ఉద్యమాలు చేస్తున్నా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని విమర్శించారు. ఈ నెల 11న యాజమాన్యంతో జేఏసీ నిర్వహించే ఐజట్‌శమనినినిచర్చలు సఫలం కాని పక్షంలో ఏ క్షణమైనా సమ్మెకు కార్మికులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఎన్‌పీడీసీఎల్ రాష్ట్ర కార్యదర్శి బొలి వెంకటరాజు, కొలగాని రమేష్, వెంకన్న, పులి గణేష్, పి.శ్రీనివాస్, పి.సీతారాములు, కె.రాఘవేంద్రరావు, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యూఎస్పీసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

భారీగా హాజరైన టీచర్లు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మంజిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్టీఎఫ్ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర నాయకులు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావ దుర్గాభవానీ ధర్నా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవానీ, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రమోషన్లతో పాటు బదిలీలు చేపట్టాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. 5571 ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలని, బీఈడీ అర్హత కలిగిన వారికి కూడా ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. అలాగే 2008 కాంట్రాక్టు ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి సమస్యలతో కూడిన మెమోరాండం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు పారుపల్లి నాగేశ్వరరావు, టి.వెంగళరావు, నాగిరెడ్డి, పద్మ, షమీ, వెంకన్న, రాంబాబు, రాందాస్, నాగేశ్వరరావు, సురేష్, జీవీ, ప్రశాంతి, వలీ, ఉద్దండ్, సీనియర్ నాయకులు మనోహర్ రాజు, రాజశేఖర్, జిల్లా నలుమూలల నుంచి 400 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సీపీఎం, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు నున్నా నాగేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, అశోక్, వెంకటేష్ సంఘీభావం తెలిపారు.



ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రాణాలను మింగేస్తున్నాయ్!

(5వ పేజీ తరువాయి)

తీసుకున్న రెడ్డిచెరువులో చేపల వేటకు వెళ్లి మృతిచెందారు. అదేగ్రామంలోని సీతచెరువులో తోటకూర జగన్ పశువుల కోసం వెళ్లి మునిగి చనిపోయాడు. జూలై 4న చిన్నమండవ గ్రామంలో ఒకే కుటుంబానికి కాసిమల్ల నాగగోపి, నందకిషోర్ అనే అన్నదమ్ములు సరదాగా ఈతకు వెళ్లి మృతిచెందారు. ఇలా తోబుట్టువులు చనిపోవడంతో ఆయా కుటుంబాలు తీవ్ర విషాదంలో ఉంటున్నాయి. ఎర్రుపాలెం మండలం బంజర గ్రామంలో ముగ్గురు వ్యవసాయ కూలీలు ఇటీవల చేపల వేటకు వెళ్లి మృతిచెందారు. వేసవి సెలవుల్లో ఇద్దరు పదో తరగతి విద్యార్థులు ఖమ్మం మున్నేరులో ఈతకు వెళ్లి కన్నుమూశారు. ఇవి జిల్లాలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు మాత్రమే.

● గత ఫిబ్రవరి 17న భద్రాద్రి గోదావరి వద్ద కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన వేముల మల్లేష్ గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఫిబ్రవరి 28న భద్రాద్రి ఆలయం సందర్శనకువచ్చిన బావ, బావమరుదులు మృతిచెందారు. వీరిలో హరిప్రసాద్ అనే వ్యక్తిది వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం అల్లీస్‌పల్లి గ్రామం కాగా.. రఘునాధపాలెం మండలం రేగుల చెలకకు చెందిన బావమరిది రూపాకుల పవన్‌కుమార్. వీరి కుటుంబాలు దైవదర్శనానికి వెళ్లగా హరిప్రసాద్, పవన్‌కుమార్ పుణ్యస్నానం చేస్తూ గోదావరిలో మునిగి మరణించారు. మార్చి 25న భద్రాచలంకు చెందిన వెంకటసాయిరామన్ వారధిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. జూన్ 7న ఉప్పల్‌కు చెందిన అఖిల్‌గౌడ్ అనే బాలుడు తల్లిదండ్రులతో భద్రాచలం వచ్చి గోదావరిలో పుణ్యస్నానం చేస్తూ గల్లంతై మృతిచెందాడు. అలాగే జిల్లాలోని పలుచోట్ల వాగులు, చెరువుల్లో తరచూ ఏదో ఒక చోట ప్రమాదవశాత్తు మరణిస్తుంటే.. కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

'ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మీనవోలులోని కట్టలేరు వద్ద గత నెల 31న చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యవసాయ కూలీలు భూక్యా కోటేశ్వరరావు(45), బాదావత్ రాజు(50), భూక్యా సాయిరాం(26) గల్లంతైన మృతిచెందారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది'



'గుండాల మండలం మామకన్నుకు చెందిన కల్తి ప్రవీణ్‌ప్రకాష్(25) తమ గ్రామానికి చెందిన కొందరితో కలిసి ఈనెల 1న ఆళ్లపల్లి మండలం అనంతోగు కిన్నెరసాని వాగు చెక్‌డ్యాం వద్ద మడుగుకు వెళ్లారు. చేపల కోసం విసిరిన వలకు చిక్కుకుని ప్రవీణ్‌ప్రకాష్ ప్రాణాలు విడిచాడు.

'బంధువు అంత్యక్రియలకు వచ్చిన ఖమ్మం నిజాంపేటకు చెందిన దాసరి రామకృష్ణ(43).. వేణుగోపాల్‌నగర్-1 సమీపంలోని సాగర్ కాల్వలో కాళ్లు కడుక్కుంటూ జారి పడి మునిగిపోయాడు. టేకులపల్లి సమీపంలో మృతదేహం గుర్తించారు. ఈనెల 4న జరిగిన ఈ ఘటన ఆ కుటుంబానికి మరింత విషాదాన్ని మిగిల్చింది.

'భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంత్‌నగర్ గ్రామ పంచాయతీకి చెందిన కొందరు విద్యార్థులు.. ఓ కోచ్‌ద్వారా ఆళ్లపల్లి మండలం మర్కోడులో వాలీబాల్, హాకీ, కబడ్డీ తదితర ఆటలాడేందుకు వెళ్లారు. అక్కడ ఆటలు పూర్తయిన అనంతరం వారంతా ఓ ఆటోలో స్వగ్రామానికి తిరుగు పయనం అయ్యారు. ఈ క్రమంలోనే సరదాగా ఈత కొట్టేందుకని అనంతోగు, రాయిపాడు మధ్య కిన్నెరసాని వాగులోని నీటి మడుగులోకి దిగారు. కానీ వారిలో ఈసం దన్విత్ అలియాస్ బిట్టు (11)నీటిలో మునిగి చనిపోయాడు. జూన్ 1న జరిగిన ఈ సంఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.'

రక్షణ చర్యలు అవసరం..

నీటి ప్రమాదాల నివారణపై అధికార యంత్రాంగం.. ముఖ్యంగా పోలీసుశాఖ అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది. చెరువులు, వాగులు, ఏర్లు, నదులున్నచోట హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు తదితర రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటితో పాటు యువత కోసం ఈత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి.. నీటిలో చిక్కిన సమయంలో ప్రాణాలు ఎలా రక్షించుకోవాలన్న దానిపై విపత్తుల నివారణ శాఖ ద్వారా అవగాహన, శిక్షణ కలిపించాల్సిన అవసరం ఉంది. భద్రాచలం లాంటి ప్రదేశాల్లో పుణ్యస్నానాలకు వెళ్లే భక్తులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఖమ్మం ఇన్‌చార్జ్ డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన నాగపద్మజ



డీఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న నాగపద్మజ

ఖమ్మం ఖానాపురం హవేలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జ్ అధికారిగా ఖమ్మం జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న ఉద్యోగోన్నతుల ప్రక్రియ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులకు మాత్రమే పదోన్నతులు అందేలా ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని అందుకు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. పదోన్నతుల కొరకు ఏ ఒక్కరినీ కలవాల్సిన అవసరం లేదని అర్హతలను బట్టి వస్తాయని, మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కార్యాలయ ఇన్‌చార్జ్ ఏడీ చావా శ్రీనివాసరావు, ఏపీఓ శ్రీనివాసరావు, ఉద్యోగులు దేవేందర్ కుమార్, యూసుఫ్‌పాషా తదితరులు నూతన డీఈవోను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మెనూ పట్ల అప్రమత్తంగా ఉండాలి

(5వ పేజీ తరువాయి)

హెచ్చరికగా భావించి ఇకముందు అలాంటి పరిణామాలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఏడాదిన్నర కాలంగా గిరిజన పాఠశాలల్లో చదివే విద్యార్థుల చదువు, ఆహారం, ఆరోగ్యం విషయంలో, ఎలాంటి పొరపాట్లు జరగలేదన్నారు. కానీ సిబ్బంది నిర్లక్ష్యం, వార్డెన్, హెచ్‌ఎం, ప్రిన్సిపాళ్ల అశ్రద్ధ వల్ల తప్పులు జరుగుతున్నాయని, ఇక ముందు ఇలా జరగకుండా చూసుకోవలసిన బాధ్యత ఉందన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందన్నారు. ప్రతీ విద్యాసంస్థలో ఫుడ్ విషయంలో ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని, వండిన ఆహారాన్ని ముందుగా ప్రిన్సిపాల్, హెచ్‌ఎం, వార్డెన్, ఉపాధ్యాయులు తిన్న తర్వాతే సర్వ్ చేసి పిల్లలకు పెట్టాలని, పిల్లలు భోజనాలు చేసిన తర్వాత అస్వస్థతకు గురైతే.. తొలుత సర్వ్ చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ విజయలక్ష్మి, ఆర్సీవో గురుకులం అరుణకుమారి, ఏటీడీవోలు సత్యవతి, భారతీదేవి, ఖమ్మం జిల్లాలోని ప్రిన్సిపాల్, హెచ్‌ఎం, వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

మరో ఐదుగురికి అస్వస్థత

(5వ పేజీ తరువాయి)

చాలామంది విద్యార్థినులు ఇంటి బాట పట్టారు. ఈ పాఠశాలలో మొత్తం 86 మంది విద్యార్థినులు ఉండగా మంగళవారం కేవలం పది మంది మాత్రమే ఉన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం తరుపున అందిస్తున్న మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అప్పుడు సుదూర ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థినులు ఇక్కడ ఉండి చదువు కొనసాగించే ఆవకాశాలున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మెనూ పాటించకపోవడం, ఆహారంలో నాణ్యత లేకపోవడంతో వసతి గృహంపై సరైన పర్యవేక్షణ లేకపోవడం విద్యార్థినులకు శాపంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారి సస్పెన్షన్..

కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో ఆహారంలో నాణ్యత లోపంతో సోమవారం 37మంది, మంగళవారం ఐదుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురవడాన్ని సీరియస్‌గా తీసుకున్న భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ వసతి గృహ సంక్షేమ అధికారి విజయ నిర్మలను సస్పెండ్ చేశారు. సదరు అధికారి వసతి గృహవిధులు, పర్యవేక్షణ, క్రమ శిక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించారన్న కారణంతో చర్యలు తీసుకున్నారని గిరిజన సంక్షేమ శాఖ ఖమ్మం జిల్లా అధికారి విజయలక్ష్మి విలేకరులకు తెలిపారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం వసతి గృహ సంక్షేమ అధికారిగా ఆ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారని సమాచారం. ఇక విద్యార్థినుల అస్వస్థత ఘటనలకు కారుకులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కూడా తన పరిశీలనలో అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయని, బాధ్యులపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు.

జాతీయస్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్‌లో భద్రాద్రికి నాలుగు బంగారు పతకాలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన వి.మల్లేష్ ప్రాతినిధ్యం వహించి, ప్రతిభ కనబర్చి నాలుగు బంగారు పతకాలు గెలుపొందారు. కేరళ రాష్ట్రంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో 105 కేజీల విభాగంలో, స్క్వాట్స్ విభాగంలో 115 కేజీలు, బెంచ్ ప్రెస్ విభాగంలో 77.5 కేజీలు, డెడ్ లిఫ్ట్ విభాగంలో 135 కేజీలు ఈ మూడు విభాగాల మొత్తం కలిపి 327.5 కేజీల బరువెత్తి మరో బంగారు పతకం సాధించి తెలంగాణ రాష్ట్రానికి నాలుగు బంగారు పతకాలు అందించాడు. ఈ పతకాలు సాధించిన క్రీడాకారుడిని మంగళవారం రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జోసప్, భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ.రామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు బోగాల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, కోశాధికారి మహంతి వెంకటకృష్ణ, జాతీయస్థాయి క్రీడాకారుడు డీవీ.శంకర్‌రావు, వివిధ సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.



మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించిన భద్రాద్రి క్రీడాకారుడు మల్లేష్

'క్షయ' నిర్మూలనకు కృషి చేయాలి

భద్రాద్రి జిల్లాలో 1340 కేసులు

జిల్లా 'క్షయ' నియంత్రణ అధికారి డాక్టర్ పుల్లారెడ్డి

జూలూరుపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): క్షయ నిర్మూలనకై వైద్య సిబ్బంది, ప్రజలు కృషి చేయాలని జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ పుల్లారెడ్డి తెలిపారు. మంగళవారం జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మండలంలో క్షయవ్యాధి గ్రస్తుల వివరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1340 క్షయ కేసులు నమోదయ్యాయని జూలూరుపాడు మండలంలో క్షయ కేసులు అధికంగా వున్నాయని తెలిపారు. క్షయ వ్యాధిని మందుల ద్వారా తగ్గించవచ్చన్నారు. వ్యాధి గ్రస్తులను సకాలంలో గుర్తించాలని సూచించారు. ప్రభుత్వం క్షయ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులతో పాటు న్యూట్రీషియన్ కిట్లను అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు బి.వెంకటేశ్వర్లు, తేజశ్విని, సూపర్‌వైజర్ రఫెల్, నోడల్ అధికారి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ పుల్లారెడ్డి

రేపటి నుంచి 'సదరం' క్యాంపులు

ఈ నెల 30 వరకు శిబిరాల నిర్వహణ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులకు యూడీఐడీ శిబిరం ద్వారా జారీ చేసే వైకల్య నిర్ధారణ ధ్రువీకరణ పత్రాలు ఉంటేనే గుర్తింపు లభిస్తుంది. దీని ద్వారానే దివ్యాంగులు పలు ప్రయోజనాలు పొందే ఆస్కారం ఉంటుంది. పుట్టుకతో అంగవైకల్యం, నరాల బలహీనత, కంటిచూపు లోపం, వినికిడి సామర్థ్యం కోల్పోవడం, మతిస్థిమితం కోల్పోయిన వారు, యాసిడ్ దాడులకు గురైన వారు శిబిరానికి హాజరైతే వైద్య బృందం పరీక్షలను నిర్వహించి నెల రోజుల్లో గుర్తింపు పత్రాన్ని జారీ చేస్తుంది. రహదారి ప్రమాదాల్లో గాయపడి వికలత్వం పొందిన వారికి కూడా ఇవి వర్తిస్తుంది.

30వ తేదీ వరకు క్యాంపులు

కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నుంచి ఆగస్టు 30వరకు నిర్ణయించిన తేదీల ప్రకారం సదరం క్యాంపులను నిర్వహించి ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయనున్నట్లు జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఎం.నరేందర్ తెలిపారు. మీసేవా కేంద్రాల్లో సదరం వైకల్యం అంచనా ధ్రువీకరణ పత్రం కోసం స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌ఫోటోను మీసేవ కేంద్రానికి తీసుకెళ్లాలి. స్లాట్ బుకింగ్ ప్రకారం దరఖాస్తు దారుడు మీసేవ రశీదుతో పాటు మెడికల్ క్యాంపుకు హాజరవ్వాల్సి ఉంటుంది. వైద్యులు క్యాంపుల్లో పార్ట్- ఎ వివరాలను ఆమోదించి సదరం గుర్తింపు సంఖ్య నమోదు చేస్తారు. ఆగస్టు 7, 12, 14, 19, 21, 23, 26, 28, 30వరకు మొత్తం 95, రెన్యువల్ స్లాట్స్ 25, మొత్తం 120స్లాట్స్ మీసేవలో అందుబాటులో ఉంటాయని సూపరింటెండెంట్ తెలిపారు.

పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయంటూ వినియోగదారుల ఆందోళన

సత్తుపల్లిరూరల్, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయంటూ వినియోగదారులు ఆందోళన చేసిన సంఘటన మంగళవారం రాత్రి గంగారంలో చోటు చేసుకుంది. పోలీస్ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో మండలంలోని ప్రకాష్‌నగర్ కాలనీకి చెందిన కువ్వారపు లక్ష్మణరావు మధ్యాహ్నం రూ.500కు తన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ పోయించుకుని వీఎం.బంజర్ బయలుదేరాడు. మార్గమధ్యలో తరచూ ఆగిపోవడంతో మెకానిక్‌కు చూయించగా బాటిల్‌లో పెట్రోల్ తీయగా మొత్తం నీళ్లే రావడంతో ఆందోళనకు గురైన బాధితుడు పెట్రోల్ బంక్ నిర్వాహకులను నిలదీశాడు. తమకు సంబంధం లేదని సమాధానం చెప్పారని, తనకు అధికారులే న్యాయం చేయాలంటూ బాధితుడు వేడుకుంటున్నాడు.

నేలకొరిగిన మూడు శతాబ్దాల వృక్షం



బూర్గంపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బూర్గంపాడులోని ముదిరాజ్‌బజార్‌లో గల మూడు శతబ్దాల నాటి రావి చెట్టు మంగళవారం నేల కొరిగింది. మూడు శతాబ్దాల నాటి రావిచెట్టుకింద ముత్యాలమ్మ ఆలయం, పక్కనే అరుగు కూడా ఉండడంతో ఆలయానికి సందర్శించే భక్తులతో పాటు స్థానికులు ఆ చెట్టు కింద కూర్చొని సేద తీరుతుంటారు. వృక్షం నేలకొరిగే సమయంలో ముత్యాలమ్మ ఆలయం, పక్కనే ఉన్న ఓ ఇంటిపై పడిపోవడంతో ఆలయం ధ్వంసమైంది. నేలకొరిగిన భారీ వృక్షాన్ని చూసేందుకు స్థానికులు బారులు తీరారు. అధికారులు నేలకొరిగిన వృక్షాన్ని పరిశీలించారు.

అరుదైన విషసర్పం పట్టివేత



అరుదైన పామును పట్టుకున్న ముజాఫర్

మణుగూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మణుగూరు ఏరియాలోని సింగరేణి బంగ్లాస్ ఏరియాలో సోమవారం రాత్రి సెక్యూరిటీ సిబ్బందికి అరుదైన విషసర్పం కన్పించింది. వెంటనే ఈ విషయాన్ని ప్రాణధార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ సభ్యుడు ముజాఫర్‌కు తెలిపారు. వెంటనే ముజాఫర్ సంఘటనా స్థలానికి చేరుకుని చాకచక్యంగా పామును పట్టుకున్నాడు. నేటి వరకు తాను ఇలాంటి పామును చూడలేదని తెలిపాడు. ఈపాము రౌండ్‌గా ఉండకుండా, మూడు పలకల ఆకృతిని కలిగి ఉందన్నాడు. పసుపు నలుపు చారలతో ఆకర్షణీయంగా ఉన్న ఈ పాము విషయాన్ని ట్రస్ట్ వ్యవస్థాపకుడు స్నేక్ స్పెషలిస్టు సంతోష్‌కు తెలుపగా విషపూరితమైన కట్ల పాము జాతికి చెందిన బాండెడ్ క్రైట్ స్నేక్ అని, హిమోటాక్సిన్ విషాన్ని కలిగి ఉంటుందని తెలిపాడు. ములుగు, ఏటూరునాగారం, మణుగూరు మండలాల్లో రామానుజవరంగ ప్రాంతాల్లో ఉంటున్నాయన్నారు. రాత్రి వేళల్లో మాత్రమే ఇవి సంచరిస్తాయని తెలిపాడు. ఈ విష సర్పాన్ని పట్టుకున్నందుకు ముజాఫర్‌ను సంతోష్ అభినందించాడు.

దశల వారీగా హామీలు నెరవేరుస్తున్నాం

» అభివృద్ధి చేస్తున్నాం.. ఆశీర్వదించండి » మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని, పేదల సంక్షేమమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు నిర్వహిస్తున్నామని, అభివృద్ధి చేస్తున్నామని నిండు మనసుతో ఆశీర్వదించాలని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన కలెక్టర్ అనుదీప్‌తో కలిసి తిరుమలాయపాలెంలో పర్యటించి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. తిరుమలాయపాలెం నుంచి పిండిప్రోలు వరకు వరకు రూ.2.20కోట్లు, తిరుమలాయపాలెం నుంచి వెదుళ్లచెరువు వరకు రూ.1.10కోట్లతో చేపడుతున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రైతువేదికలో రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మీ చెక్కులు అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి సీసీ రోడ్లు, సాగు, తాగునీరు, విద్యా, వైద్యం, రహదారులు సౌకర్యం కలిపించి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ఇప్పటికే పాలేరు నియోజకవర్గంలో



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

ప్రతీ ఎకరానికి సాగునీరు అందించే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. పాలేరుకు కృష్ణాజలాలతోపాటు సీతారామ ద్వారా గోదావరి జలాలు తీసుకొచ్చి సస్యశ్యామలం చేస్తామన్నారు. తిరుమలాయపాలెం మండలంలో రూ.77.50కోట్లుతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆ నిధులతో అంతర్గత రహదారులు, సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు నిర్మాణం చేపట్టామన్నారు. మండలానికి రూ.45కోట్లతో ఐటీఐ కళాశాల మంజూరు చేశామని, మండలంలో 30పడకల ఆసుపత్రిని రూ.26కోట్లతో 50 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు తెలిపారు అర్హులైన పేదలందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. తరతరాల నుంచి మనకున్న ఆస్తుల పట్ల గత ప్రభుత్వం ధరణి పేరుతో భయం కలిపించిందని, రైతులకున్న భూసమస్యలు పరిష్కరించేందుకు గాను భూ భారతి చట్టం తెచ్చిందన్నారు. ఆగస్టు 15నాటికి భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పదేళ్లలో పేదలకు రేషన్ కార్డు ఇవ్వలేదని ఈ ప్రభుత్వం వచ్చాక 5.17లక్షల రేషన్‌కార్డులు పంపిణీ చేశారన్నారు. ఈ సభలో కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులైన పేదలను గుర్తించి పంపిణీ చేస్తున్నామన్నారు. రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేడీఏ పుల్లయ్య, డీఎస్వో చందన్‌కుమార్, ఆర్డీవో నరసింహారావు, ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహసీల్దార్ లూథర్‌విల్సన్, పీఆర్ఎస్ఈ వెంకటరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, బొర్రా రాజశేఖర్, బోడ మంగిలాల్, ఏవో సీతారాంరెడ్డి, తదితరులున్నారు.

యావత్ దేశం చూసేలా ఖమ్మంలో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన

» బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుపై బీజేపీ దొంగాట
» బూర్జువ పార్టీలతో స్థానిక ఎన్నికల్లో పొత్తు ఉండదు
» వామపక్ష పార్టీలు ముందుకొస్తే ఐక్యంగా పోటీ
» సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాలస్తీనా ప్రజలకు మద్దతుగా ఖమ్మంలో ఈనెల 7న నిర్వహించే సంఘీభావ ప్రదర్శన యావత్ భారతదేశం ఖమ్మం వైపు చేసేలా ర్యాలీ జరుగుతుందని, అందుకు సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. మంగళవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవుల అశోక్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా ప్రోత్సహకంతోనే ఇజ్రాయిల్ ఇటువంటి దాడులు చేస్తుందన్నారు. పశ్చిమాసియాలో చైతన్యవంతంగా ఉండే పాలస్తీనా ప్రజల్ని హతమార్చడమే అమెరికా లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చేసి ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని, బీసీ బిల్లుకు ఆమోదం తెలపటంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దొంగాట ఆడుతుందన్నారు. కవిత బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలకు బీసీ బిల్లు రాజకీయ క్రీడగా మారిందని ఆరోపించారు. వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ ఎట్టి పరిస్తితిలో బూర్జీవ పార్టీలతో పొత్తు పెట్టుకోదని, సీపీఎం, సీపీఐ, ఇతర వామపక్ష పార్టీలు కలిసి వస్తే ఐక్యంగా పోటీ చేస్తామన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని ధర్మ స్థలి ప్రాంతంలో అధర్మం నడుస్తుందని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు సీవై పుల్లయ్య, ఆర్ శివలింగం, జీ రామయ్య, బద్దెల వెంకయ్య, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఆవుల అశోక్, కోలేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

తెగుళ్లకు 'సెలైన్' 'ట్రీ'ట్మెంట్

» ఆయిల్‌పామ్‌లో వినూత్న పద్ధతి
» కొణిజర్ల మండలం లాలాపురంలో తొలిసారి అమలు
» మలేషియా, ఇండోనేషియాలోని సాగు విధానమే ఆదర్శం

కొణిజర్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ తోటలకు గానోడెర్మాతెగులు సోకటంతో ఆ తెగుళ్ల నివారణకు ఉద్యాన శాఖ వినూత్నపద్ధతిని అమలు చేస్తోంది. ఈ తెగుళ్ల నియంత్రణకు మలేషియా, ఇండోనేషియాలో చేసిన పరిశోధన ఫలించడంతో అక్కడి విధానాన్ని రాష్ట్రంలోనూ అవలంబిస్తున్నారు. ఈ క్రమంలోనే తొలిసారి ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లాలాపురం గ్రామానికి చెందిన పాషా అనేరైతుకు చెందిన తొమ్మిది ఎకరాల ఆయిల్‌పామ్ తోటలో వినూత్న ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. ఈ తోట సాగు చేసి 19 సంవత్సరాల వగా.. అక్కడక్కడ చెట్లకు గానోడెర్మా తెగులు సోకింది. దిగుబడి తగ్గుతున్న సమయంలో సదరు రైతు వైరా ఉద్యాన శాఖాధికారి ఆకుల వేణును సంప్రదించారు. ఆ అధికారి తోటను పరిశీలించి ఈ పద్ధతిని అమలుచేస్తున్నారు. మలేషియా, ఇండోనేసియాలో చెట్లకు హెక్సాకోనజోల్ మందును సెలైన్ బాటిళ్లలో నింపి.. చెట్టుకాండం నుంచి లోపలికి పంపిస్తున్నారు. అదే పద్ధతిని పాషాకు చెందిన ఆయిల్‌పామ్ తోటలో ఆచరిస్తున్నామని ఉద్యానశాఖ అధికారి తెలిపారు. గానోడెర్మా తెగులు చాలా ప్రమాదకరమైందని, ఈ తెగులు సోకిన నెలల వ్యవధిలోనే 43శాతం దిగుబడిని తగ్గిస్తుందని, 50శాతం కంటే ఎక్కువగా కుళ్లినప్పుడు మాత్రమే తెగులు లక్షణాలు బయటకు కనిపిస్తాయన్నారు. ఎక్కువగా తేలిక నేలల్లో విస్తారంగా వ్యాప్తి చెందుతుందని, ఈ తెగులు తొలుత భూమిలోపల వేర్లను ఆశించి వేర్ల నుంచి కాండంలోకి వ్యాపిస్తుందన్నారు. 200మిల్లీలీటర్ల నీటిలో 20మిల్లీలీర్ల హెక్సాకోనజోల్ మందును కలిపి సెలైన్ బాటిల్ ద్వారా చెట్టుకాండంలోకి పంపించాలని, చెట్టుకాండముకు 16సెంటీమీటర్ల రంధ్రం చేసి దాని ద్వారా మందు నీటిని పంపాలని చెబుతున్నారు. ఇలా చేయటం వల్ల మొక్కను చనిపోకుండా కాపాడుకోవచ్చని, మందు ఫలితం నెమ్మదిగా కనిపిస్తుందని, మొదటి సారిగా లాలాపురంలో అమలు చేస్తున్నామన్నారు.



చెట్టుకు అమర్చిన సెలైన్ బాటిల్

సెలైన్ బాటిల్‌లో మందును కలుపుతున్న ఉద్యానవనశాఖాధికారి వేణు

విద్యార్థినితో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

» వాష్‌రూం వద్ద వెనుకనుంచి వచ్చి ఆలింగనం
» గతంలో పలుమార్లు ఆమెతో ఇదే తరహా తీరు
» ఆలస్యంగా వెలుగులోకి ఘటన

దుమ్ముగూడెం ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య మోడల్ పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థిని పట్ల ఓ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలో జరిగింది. ఈనెల 3న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలో నిర్వహిస్తున్న ఏకలవ్య మోడల్ పాఠశాలలోని ఆరో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఈ నెల 3న పాఠశాలలోని వాష్‌రూం ప్రాంతంలో ఉండగా.. ఎల్.నాగేశ్వరరావు అనే ఉపాధ్యాయుడు వెనుక నుంచి ఆమెను గట్టిగా ఆలింగనం చేసుకున్నారు. దీంతో భయాందోళనకు గురైన విద్యార్థిని కేకలు వేయడంతో వదిలేసి వెళ్లిపోయాడు. అయితే గతంలోనూ ఆ ఉపాధ్యాయుడు అదే విద్యార్థినిని తాకకూడని చోట్ల చేతులు వేసేవాడని, పలుమార్లు బాలిక వైపు చూసి కనుసైగలు చేశాడని తెలుస్తోంది. ఈ విషయాన్ని బయటకు చెప్పుకోడానికి అవకాశం లేని ఆ చిన్నారి 4వతేదీ సోమవారం తెలిసిన వారి ఫోను ద్వారా తన తల్లికి సమాచారమిచ్చింది. దీంతో మంగళవారం పాఠశాలకు వచ్చి విద్యార్థిని తల్లి ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసింది. అలాగే సదరు విద్యార్థిని కూడా లిఖితపూర్వకంగా ప్రిన్సిపాల్‌కు ఇవ్వగా.. తన కూతురిని వేధింపులకు గురిచేస్తున్న ఉపాధ్యాయుడిని పిలిపించి విచారించాలని విద్యార్థిని తల్లి కోరగా, ఆ ఉపాధ్యాయుడు క్యాంపస్‌లో లేడని ప్రిన్సిపాల్ సమాధానం చెప్పారు. కానీ కొద్దిసేపటికే సదరు ఉపాధ్యాయుడు పాఠశాల నుంచి బయటకు వెళ్లడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తప్పుచేసిన ఉపాధ్యాయుడిని వెనకేసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. అతడు పాఠశాలలో ఉన్నా లేడని చెప్పడమేంటని విద్యార్థిని తల్లి ఆగ్రహం వ్యక్తం చేయడంతో.. ఆ ఉపాధ్యాయుడికి మెమో ఇస్తానని ప్రిన్సిపాల్ విద్యార్థిని తల్లికి చెప్పినట్టు తెలుస్తోంది. అయితే ఈ ఘటన గురించి వివరణ కోరేందుకు ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

4కిలోల గంజాయి పట్టివేత

మధిర రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఒడిశా రాష్ట్రం నుంచి తీసుకువచ్చి అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన రూ.రెండులక్షల విలువైన నాలుగు కిలోల గంజాయిని మంగళవారం మధిర టౌన్ పోలీసులు పట్టుకొని ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. మధిర టౌన్ ఎస్‌హెచ్‌వో రమేష్, ఎస్ఐ కిషోర్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. భూక్యా అనూష్‌నాయక్, కుంచం గోపిచంద్‌లు ఒడిశా రాష్ట్రంలోని సీలేరు ఏరియా పుష్పలంక గ్రామం నుంచి గంజాయిని మధిరకు తీసుకువచ్చారు. ఈ గంజాయిని మధిరతోపాటు చుట్టూపక్కల వాసులకు అమ్మేందుకు సిద్ధంగా ఉంచారనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో టౌన్ ఎస్ఐ, సిబ్బంది గస్తీ నిర్వహించి గంజాయిని అమ్మేందుకు తీసుకువెళ్తుండగా పట్టుకున్నారు. నాలుగు కిలోల గంజాయిని పట్టుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం వారిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

● ఖమ్మం, కొణిజర్లలో ఘటనలు

ఖమ్మంక్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొని యువకుడు మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. కొణిజర్ల మండలం పెద్దగోపతి గ్రామనికి చెందిన గుండ్ల రామకృష్ణ(22) ఖమ్మంలో సెల్‌ఫోన్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా శ్రీశ్రీ సర్కిల్ వద్దకు వెళ్లగానే ఎదురుగా ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో స్థానికులు తీవ్రంగా గాయపడిన రామకృష్ణని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

కొణిజర్ల: ఆటోను లారీ ఢీకొట్టిన సంఘటన మండల పరిధిలోని పల్లిపాడు సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన సయ్యద్ సైదులు(45) ఆటోను నడుపుకుంటూ వైరా వైపు వెళ్లుతుండగా, వైరా వైపు నుంచి వస్తున్న లారీ పల్లిపాడు సమీపంలో ఎదురుగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సైదులు ఆటోలోనే ఇరుక్కుపోయి అక్కడకు అక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



సైదులు(ఫైల్)

పరిహారం ఇప్పించాలని ఫిర్యాదు

» విత్తన లోపంతో నష్టపోయామని అన్నదాతల ఆవేదన

తల్లాడ, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): విత్తన లోపంతో మొక్కజొన్న సాగు చేసిన రైతులు నష్టపోయారు. నష్టానికి కారణమైన విత్తన కంపెనీలపై చర్యలు తీసుకుని పరిహారం ఇప్పించాలని కోరుతూ తల్లాడ మండలం ముద్దునూరు గ్రామ రైతులు మంగళవారం తల్లాడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో ముద్దనూరు గ్రామానికి చెందిన రైతులు సుమారు 80 ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశారు. అదే గ్రామానికి చెందిన వ్యక్తి విత్తన ఏజెంట్‌గా ఉన్న ప్రముఖ విత్తన కంపెనీల నుంచి విత్తనం కొనుగోలు చేసి సాగు చేశారు.. మూడు నెలల తర్వాత మొక్కజొన్న పంట కోతకు వచ్చిందని. ఎకరానికి మూడునుంచి పది క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. ఎకరానికి 40క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఏజెంట్ చెప్పడంతో నమ్మి విత్తనం కొనుగోలు చేశామని, విత్తన లోపం వల్ల దిగుబడి గణనీయంగా తగ్గి నష్టపోయామని రైతులు వాపోయారు. విత్తన ఏజెంట్‌ను నిలదీయడంతో ఈఏడాది జూన్ 1వతేదీ నాటికి విత్తన కంపెనీ నుంచి నష్ట పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చి మూడు నెలలుగా దాటవేస్తున్నట్టు రైతులు తెలిపారు. విత్తన లోపం వల్ల జరిగిన నష్టపరిహారాన్ని సంబంధిత విత్తన కంపెనీలు నుంచి ఇప్పించాలని కోరుతూ పోలీసుస్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో రైతులు గోపాల్, కృష్ణార్జునరావు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, హరీష్, కృష్ణ, కొండలరావు, నరసింహారావు, చంటి తదితరులున్నారు.



పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేస్తున్న రైతులు

విద్యుదాఘాతంతో రైతు సజీవదహనం

» బైక్‌పై వెళ్తుండగా విద్యుత్‌వైరు తగిలి మృతి
» గుండాల మండలం వెన్నెలబైలు గ్రామంలో సంఘటన

గుండాల, ఆగస్టు 5: విద్యుత్ తీగలు తగిలి రైతు సజీవదహనం అయిన సంఘటన గుండాల మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వెన్నెలబైలు గ్రామానికి చెందిన పర్షిక రాజు(30) మంగళవారం ఉద యం తన మొక్కజోన్న చేను వద్దకు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో శం భూనిగూడెం వైపు వెళ్లే విద్యుత్ తీగ తెగిపడింది. దాన్ని గమనించకుండా వెళ్తున్న రాజుకు విద్యుత్ వైరు తగలడంతో బైక్‌తో సహ కిందపడి మంటలు అంటుకుని మృతి చెంది సజీవదహనం అయ్యాడు. అటుగా వెళ్తున్న రైతులు చూసి గ్రామస్థులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న గ్రామస్థులు ఏమీ చేయలేని పరిస్థితితో బోరున విలపించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లెందుకు తరలించారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంగానే పర్షిక రాజు మృతి చెందాడని గ్రామస్థులు ఆరోపించారు. స్తంభంపై ఇన్సులేటర్ ఫెయిల్ కావడంతోనే తీగతెగి ప్రమాదం జరిగిందన్నారు. విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు స్పష్టంగా తెలుస్తుందని ఆరోపించారు. మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



పర్షిక రాజు మృతదేహం

చెక్‌బౌన్స్ కేసుల్లో ఇరువురికి జైలు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): అప్పుగా తీసుకున్న రూ.9లక్షలను తిరిగి చెల్లించనందున ఓ వ్యక్తికి రూ.13లక్షల పరిహారంతో పాటు ఏడాది జైలు శిక్ష పడింది. చెల్లని చెక్కు ఇవ్వడంతో రూ.4లక్షలతో పాటు 4నెలల జైలుశిక్ష విధిస్తూ సత్తుపల్లి ప్రిన్సిపల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి బీఎస్ఎన్.సుమబాల మంగళవారం తీర్పుఇచ్చారు. పెనుబల్లి మండలం కారాయిగూడేనికి చెందిన రాధాకృష్ణకు సత్తుపల్లి పట్టణానికి టీ.గణేష్ 2011లో రూ.9లక్షలు అప్పుగా ఇవ్వగా, ఏడాది తర్వాత చెక్కు ఇవ్వగా చెల్లకపోవడంతో సీనియర్ న్యాయవాది పిన్నం జానకీ రామారావు ద్వారా కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడికి రూ.13లక్షలతో పాటు ఏడాది జైలు శిక్ష విధించగా నగదు చెల్లించని పక్షంలో మరో ఏడాది జైలు శిక్ష అమలు చేయాలని తీర్పు చెప్పారు. అదేవిధంగా ఏపీలోని వత్సవాయికు చెందిన దండమూడి బసవ పూర్ణచంద్‌రావుకు మండలంలోని కిష్టాపురానికి చెందిన హసావత్ చిట్టెమ్మ అప్పుగా ఇచ్చి మొత్తం తిరిగి ఇవ్వకపోవడంతో న్యాయవాది మాయర రమేష్ ద్వారా చెల్లని చెక్కు కేసు నమోదు చేశారు. 4నెలల జైలుశిక్షతో పాటు రూ.4లక్షల చెల్లించాలని, నగదు ఇవ్వని పక్షంలో మరో 8నెలలు జైలు శిక్ష అమలు అవుతందని న్యాయాధికారి తీర్పు చెప్పారు.

అధిక మద్యం సేవించిన కేసులో ఇద్దరికి ..

భద్రాచలం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలో అధికంగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయిన ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి భవాని మంగళవారం తీర్పు వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 20మందిని ట్రాఫిక్ పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టగా ఇద్దరికీ అధిక రీడింగ్ నమోదైనందున రెండు రోజుల జైలుశిక్ష విధించారు. మిగతవారికి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత అదృశ్యం

అశ్వాపురం ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమెర్దా గ్రామానికి చెందిన ఓ వివాహిత యువతి తన ఇద్దరు పిల్లలతో సహ అదృశ్యం అయిన సంఘటనపై మంగళవారం అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం ప్రకారం.. అమెర్ధా గ్రామానికి చెందిన శ్యామల రవి భార్య లావణ్య తన ఇద్దరు పిల్లలతో ఈనెల 3న మణుగూరులోని ఓప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి ఉదయం ఇంటినుంచి వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో గాలించారు. ఎక్కడా ఆచూకీ తెలియకపోవడంతో రవి మంగళవారం అశ్వాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుప్రసాద్ తెలిపారు.

మనస్తాపానికి గురై బెటాలియన్ కానిస్టేబుల్ ఆత్మహత్య



బాలరాజు (ఫైల్)

సత్తుపల్లిరూరల్, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లాకు చెందిన (పీసీ1215) అల్లం బాలరాజు (40) బెటాలియన్ కానిస్టేబుల్ 18ఏళ్లుగా పనిచేస్తున్నాడు. కాగా భార్యాపిల్లలతో కలసి మండలంలోని బేతుపల్లిలో ఓ ఇంటిలో అద్దెకు ఉం టుండగా ఏడాది క్రితం విడిపోయారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన బాలరాజు మూడు రోజుల క్రితం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డా డు. గమనించిన స్థానికులు బెటాలియన్ అధికారులకు సమాచారం అందిం చా రు. అధికారులు పోస్టుమార్టం నిమ్మితం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్‌శాఖలో ఇద్దరిపై వేటు

» అవినీతిపై విచారణ... ఏఈ, ఏఎల్ఎం సస్పెన్షన్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుపై రైతుల నుంచి డబ్బులు వసూళ్లు చేసిన ఇద్దరు విద్యుత్ ఉద్యోగులకు శాఖాపరంగా వేటుపడింది. ఒకే మండలంలోని ఇద్దరు ఉద్యోగులు కావడంతో విద్యుత్‌శాఖలో చర్చనీయాంశంగా మారింది. తిరుమలాయపాలేం మండలం చింతల్‌తండాలో ఓ రైతుకు వ్యవసాయ విద్యుత్ లైన్ ఏర్పాటుకు టీజీఎస్పీడీసీఎల్ నిబంధనల మేరకు చెల్లింపులు చేశారు. నిబంధనల మేరకు నిర్ణీత సమయంలో వ్యవసాయ కనెక్షన్ ఏర్పాటు చేయాల్సిన ఏఈ భాస్కర్‌రావు, ఏఎల్ఎం జగత్ జీవన్‌లు రైతుతో భేరాలాడారు. త్వరగా విద్యుత్ కనెక్షన్ రావాలంటే రూ. లక్ష వరకు ఖర్చు అవుతుందని డిమాండ్ చేశారు. తర్వాత రూ.90వేలకు భేరం మాట్లాడుకున్నారు. కాగా ఈ సంఘటన విద్యుత్‌శాఖలోని విజిలెన్స్ విభాగం అధికారులకు సమాచారం అందింది. అంతర్గతంగా విచారణ చేపట్టారు. ఏఈతో పాటుగా ఏఎల్ఎం డబ్బులు వసూళ్లు చేసిన విషయం తెలియడంతో, అధికారులు ఇద్దరిని సస్పెండ్ చేశారు.

ఈ విషయంపై టీజీఎస్పీడీసీఎల్ జిల్లా పర్యావేక్షణ అధికారి ఇనుగూరి శ్రీనివాసాచారి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఇద్దరి ఉద్యోగులను సస్పెండ్ చేసిన విషయాన్ని ధృవీకరించారు. విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది ఎవ్వరైనా డబ్బులు అడిగితే 92810 33233 నెంబర్‌కు ఫిర్యాదులు చేయాలని, ఫిర్యాదులు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.



చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు

ఖమ్మంలీగల్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): చీఫ్ లీగల్‌ఎయిడ్ కౌన్సిల్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌ను నియమిస్తూ మంగళవారం జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం పట్టణానికి చెందిన న్యాయవాది బిల్లా శ్రీనివాసరావును చీఫ్‌లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా కండె వెంకటేశ్వరరావుని నియమించారు. వీరి నియామకంపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు తో పాటు పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు.

మున్నేరుకు అనూహ్యంగా వరద

- ఎగువన మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు
- అప్రమత్తమైన అధికారులు
- మూడు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల పరిశీలన



పునరావాస కేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య



పెరిగిన వరద

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మున్నేరుకు అనూహ్యంగా 11అడుగులకు వరద చేరింది. ఇటీవల వర్షాలకు వరంగల్, మహబూబాబాద్‌జిల్లాలతో పాటుగా ఇల్లెందు, సింగరేణి, కామేపల్లిలోని చెరువులకు భారీగా వరద నీరు చేరింది. దీంతో ఆలేరు, బుగ్గవాగు, పాకాల చెర్వుల నుంచి వరద మున్నేరుకు చేరుతోంది.గతేడాది అనుభవాలతో ముందస్తు అంచనాలు వేసిన కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం ఉదయం మున్నేరు పరివాహక ప్రాంతంలో పర్యటించారు. వరద పోటుపై ఎగువ ప్రాంతాల్లోని అధికారులతో మాట్లాడారు. వరద పోటు పెరిగితే మున్నేరు పరివాహక ప్రాంత ప్రజల్ని తరలించేందుకు పునరావాస కేంద్రాల ఏర్పాటును పరిశీలించారు. మహిళా డిగ్రీకాలేజీ, స్వర్ణభారతి కల్యాణ మండపం, రామన్నపేటలో ఫంక్షన్ హాల్‌ను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. మున్నేరు పరివాహక ప్రాంతంలోని వార్డు ఆఫీసర్లు, ఇతర ఉద్యోగులను అప్రమత్తం చేశారు. కేఎంసీ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ ఉద్యోగులను అప్రమత్తం చేశారు.

బోడేపూడి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సాయిబాబు

28వ వర్ధంతి సభలో ఘన నివాళి



మాట్లాడుతున్న కేంద్ర కమిటీ సభ్యులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): మాజీఎమ్మెల్యే దివంగత బోడేపూడి వెంకటేశ్వరరావు జీవితం అందరికి స్ఫూర్తిదాయకమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం సాయిబాబు పేర్కొన్నారు. మంగళవారం సుందరయ్య భవన్‌లో కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన బోడేపూడి 28వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈసందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ వైరా నియోజకవర్గంతో పాటుగా ఇతర ప్రాంతాలకు బోడేపూడి సుజల స్రవంతి పేరుతో వందలాది గ్రామాలకు తాగునీటి సమస్యను తీర్చారని కొనియాడారు. అసెంబ్లీలో బోడేపూడి మాట్లాడుతుంటే సీఎంలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఆసక్తిగా వినేవారని గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా ఇరిగేషన్‌శాఖలు, ప్రాజెక్టుల నిర్మాణాలపై బోడేపూడి నిర్ణయాలను అమలు చేశారన్నారు. జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బుగ్గవీటి సరళ, ఎం. సుబ్బారావు, బండి రమేశ్, బండి పద్మ, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంపునకు చర్యలు

- త్వరలో జేఎన్‌టీయూ కళాశాల భవన పనులు పూర్తి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- పీఎస్‌ఆర్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్ల పంపిణీలో పాల్గొన్న మంత్రి పొంగులేటి, కలెక్టర్ అనుదీప్

ఖమ్మంరూరల్, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏదులాపురం ప్రభుత్వ పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థినులకు పీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సైకిళ్లు అందజేశారు. గత ఏడాది పాలేరు నియోజకవర్గంలో 8నుంచి 10వ తరగతి వరకు చదివే బాలికలకు సైకిల్స్ పంపిణీ చేశామన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఈఏడాది 8వ తరగతికి వచ్చిన బాలికలకు, ఇంటర్ ప్రభుత్వ కళాశాలల్లో కొత్తగా చేరిన బాలికలకు సైకిల్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో గురుకులాల్లో పిల్లలకు సరైన ఆహారం పెట్టలేదని తెలిపారు. ఎన్నికల సమయంలో హామీ ఇవ్వకపోయినా గురుకులాల దుస్థితి చూసి 40 శాతం డైట్ చార్జీలు, 22 శాతం కాస్మోటిక్స్ చార్జీలను పెంచామన్నారు. పాలేరు నియోజకవర్గంలో రూ.46 కోట్లతో ఐటీఐ మంజూరు చేశామని, త్వరలో తిరుమలాయపాలెంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏదులాపురంలో గతప్రభుత్వం పేరుకు జేఎన్టీయూ కళాశాల మంజూరు చేస్తే మన ప్రభుత్వం రాగానే మొదటివిడత కింద రూ.110 కోట్లు మంజూరు చేశామని,త్వరలో ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.200 కోట్లతో 3వేలకు పైగా పిల్లలు చదువుకునేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసుకున్నామని తెలిపారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సీఎం ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనం వండే సమయంలో పొగ రాకుండా సోలార్‌విద్యుత్ ఉత్పత్తి ద్వారా వంట జరిగేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ డీఈవో నాగపద్మజ, ఆర్డీవో నరసింహారావు, కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

- వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



డబుల్ బెడ్రూం ఇళ్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్

తిరుమలాయపాలెం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారంతిరుమలాయపాలెంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఓపీ సేవలు, ల్యాబు, మెడికల్ ఫార్మసీ ప్రసూతి కాన్పుల గదిని పరిశీలించారు. వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని పేర్కొన్నారు. ప్రతిరోజు వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా తదితర వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో డెంగీ కేసులు నమోదవుతున్నాయని , ఆగ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహారావు, తహసీల్దార్ లూథర్‌విల్సన్, ఎంపీడీవోసిలార్‌సాహెబ్, మెడికల్ సూపరింటెండెట్ కృపాఉషశ్రీ, వైద్యులు బొల్లికొండ శ్రీనివాసరావు, సూరజ్, పాల్గొన్నారు.

ఇళ్లనిర్మాణాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్: జిల్లాలో పెండింగ్ ఉన్న 1132 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్ లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లనిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 7229 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు కాగా 6107ఇళ్లనిర్మాణం పూర్తయ్యాయని, 655 పురోగతిలో ఉన్నాయని, 467 నిర్మాణాలు ప్రారంభించలేదని అధికారులు కలెక్టర్‌కు నివేదిక అందించారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ జిల్లాలో 6762 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఉంటాయని, వీటిలో 5630ఇళ్లు ఇప్పటికే పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. మిగిలిన 1132డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు పంపిణీ చేయడమే లక్ష్యంగా కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు

గ్రానైట్ పరిశ్రమను ప్రోత్సహించాలి

టీడీపీ నాయకుడు వద్దెం విజయ్

ఖమ్మంమామిళ్లగూడెం, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సింగరేణి, ఆర్టీసీ కంటే ఎక్కువ మందికి ఉపాధిని కల్పించే గ్రానైట్ పరిశ్రమలను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి అని వద్దెం.విజయ్ కోరారు. ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమను ఆదాయం వనరులు దృష్టితో కాకుండా అన్ని వర్గాల వారికి ఉపాధి అవకాశాలను కల్పించే లా పరిగణలోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వలన గ్రానైట్ పరిశ్రమలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని, అధిక పన్నులు వేయటం వలన గ్రానైట్ యజమానులు ఆర్థికంగా నష్టపోయి, పరిశ్రమలు మూతపడే అవకాశం ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ నిర్ణయాలను మార్చుకొని గ్రానైట్ పరిశ్రమల మీద అధిక పన్నులను తగ్గించాలి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఎక్కువమందికి ఉపాధిని కల్పించే ఈ పరిశ్రమను ఆదుకోవాలని ఆయన జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులకు విజ్ఞప్తి చేశారు.

ప్రతిభ కనబరిచిన పోలీసులకు క్యాష్ రివార్డు



రివార్డులు అందిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): గంజాయి వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణలో ప్రతిభ కనబరిచిన టాస్కుఫోర్సు పోలీసు సిబ్బందికి నగదు అవార్డులు అందజేశారు. హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌కే ఖాసీం వలీ, కానిస్టేబుల్ వి.గోపి, యం.సతీష్‌లకు సీపీ సునీల్‌దత్ తన కార్యాలయంలో మంగళవారం అభినందించి, క్యాష్ రివార్డు అందించారు. 33 గంజాయి కేసుల్లో 120మంది నిందితులను అరెస్టు చేశారు. 192 కేజీల గంజాయిని పట్టుకోవడంలో ఈ సిబ్బంది కీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్కుఫోర్సు ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

డయల్ 100కు జూలై నెలలో 4151 కాల్స్

సమాజంలో పెరిగిపోతున్న నేర ప్రవృత్తి నేపథ్యంలో ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణే ధ్యేయంగా ఏర్పాటుచేసిన డయల్ 100కు జూలై నెలలో 4151కాల్స్ వచ్చినట్టు పోలీసుకమిషనర్ సునీల్‌దత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చిన కాల్స్‌పై విచారణ జరిపి 113 కేసులు నమోదు చేశామని, వీటిలో మహిళలపై వేధింపులు 5, దొంగతనాలు 15, సాధారణ ఘాతాలు 38, యాక్సిడెంట్లు 17, అనుమానస్పద మరణాలు 2, ఇతర కేసులు 35 అని సీపీ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి

డీఎంహెచ్‌వో కళావతిబాయి

మధిర రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేవిధంగా వైద్యసిబ్బంది కృషిచేయాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ బాణోతు కళావతిబాయి సూచించారు. మంగళవారం మధిర మండలం దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో గర్భిణీల నమోదులు నిర్వహించాలని, వారికి సంపూర్ణ ఆరోగ్య సేవలందించి కాన్పుల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవిధంగా చైతన్యపర్చాలని ఆమె కోరారు. సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిల్వలను పరిశీలించారు.

టీటీ పోటీల్లో హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ



అభినందిస్తున్న కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి

ఖమ్మంస్పోర్ట్స్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారని పాఠశాల యజమాన్యం తెలిపింది. పోటీలో సుమారు40పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని, అందులో తమ పాఠశాల విద్యార్థులు మోహిత్‌క్రిష్ణ, మహ్మద్ అనాస్, ఉజ్వల్ కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. వీరిని కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి అభినందించారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో పతకాలు

ఖమ్మంఖానాపురంహవేలి: ఇంటర్నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ సింగపూర్ వారి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ సైన్స్ కాంపిటీషన్స్‌లో హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు.130మంది పాల్గొని 21 మంది విద్యార్థులు వివిధ రకాల మెడల్స్‌ను సాధించారని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీ రెడ్డి తెలిపారు. ఒకరికి బంగారు పతకం, ఇద్దరికి రజతం, 18మందికి కాంస్య ప తకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

వేధింపులు మానుకోవాలని వినతి



డీడబ్ల్యూవోకు వినతిపత్రం అందిస్తున్న అంగన్ వాడీ టీచర్లు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కామేపల్లి అంగన్వాడీ ప్రాజెక్టుకు సంబందించిన తిమ్మారావుపేట సర్కిల్‌లో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లపై వేధింపులు మానుకోవాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) నాయకులుడు డిమాండ్ చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని మంగళవారం మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షురాలు షేక్ సుభహన్ మాట్లాడుతూ అంగన్వాడీ కామేపల్లి ప్రాజెక్ట్, తిమ్మారావుపేట సర్కిల్ సూపర్వైజర్ బక్కమ్మ ఉద్యోగ బాధ్యతలు మర్చిపోయరని, కనీసం అంగన్‌వాడీ స్కూల్స్ కూడా సందర్శించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టి యు నాయకులు భాను, గౌని మోహన్ రావ్, పారిజాతం, శిరోమణి, లక్ష్మి, కళ, పద్మ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు వెంకయ్య

కొణిజర్ల,ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన ఆదర్శ కమ్యూనిస్టు యోధుడు దొండపాటి వెంకయ్య అని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు కొనియాడారు. మంగళవారం కొణిజర్లలో స్వర్ణ రమేష్ అధ్యక్షతన జరిగిన దొండపాటి వెంకయ్య 47వ వర్ధంతిసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, దొండపాటి రమేష్, తోట రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

వీక్షించిన జిల్లా బీఆర్ఎస్ నేతలు



హాజరైన నాయకులు

ఖమ్మంమార్కెట్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఈ కార్యక్రమాన్ని జిల్లా బీఆర్ఎస్ నాయకులు వీక్షించారు. మాజీమంత్రి హరీష్‌రావు ప్రాజెక్టుపై వివరించారు. హైదరాబాద్ నుంచి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రసంగించారు. సమగ్ర వివరాలతో పెద్ద స్క్రీన్‌పై ఖమ్మంలో ఏర్పాటు చేసిన ప్రజెంటేషన్‌ను బీఆర్ఎస్ శ్రేణులు తిలకించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు చేస్తోందన్నారు. ఆ కుట్రలను ప్రజలు నమ్మొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోత్ చంద్రావతి, మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు, కూరాకుల నాగభూషయ్య ఉన్నారు.

చెత్త సేకరణలో మహిళలే ముఖ్యం

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ఇంటిపరిశుభ్రతలో మహిళలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటారో ఇంటి పరిసరాలు, ఇంటి ఎదుట రహదారుల విషయంలోనూ అలాగే పరిశుభ్రంగా చూసుకోవాలని మెప్మా డీఎంసీ సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి సూచించారు. వందరోజులు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఖమ్మం నగర వ్యాప్తంగా మహిళ సంఘాలతో మెప్మా అవగాహన సదస్సులు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, ఇతర అంశాలపై మహిళలతో సమావేశాలు పెట్టారు. ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి చెత్త సేకరణకు వచ్చే వారికి తడి,పొడి, హానికరమైన చెత్తను విడివిడిగా మూడుభాగాలుగా ఇవ్వాలని సూచించారు. కార్పొరేటర్ కన్నం ప్రసన్న, సీవోలు సల్మా, గోప్సీ ఉపేంద్ర, చిలకా ద్రౌపది, బొల్లికొండ రోజా, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు శ్రీనివాసరావు, ఆర్పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎంసీ సుజాతరాణి

మంత్రి పొంగులేటికి వినతి

తిరుమలాయపాలెం,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):తిరుమలాయపాలెం గ్రామంలో నెలకొన్న సమ్యల పరిష్కరించాలని కోరుతూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించారు. మండల కేంద్రంలో బస్టాండ్ కాంప్లెక్స్ ఏర్పాటుచేయాలని, తిరుమలాయపాలెంలోని 254 సర్వేనెంబరులో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఐటీఐ కాలేజీని తిరుమలాయపాలెంలో నిర్మించాలని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం, పోలీసుస్టేషన్‌లకు కొత్తభవనాలు నిర్మించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్ము శ్రీను, పి.సుధాకర్, టి.నాగేశ్వరరావు, జి.అశోక్, వీరబాబు,రమేష్‌కొమ్ము పూలే పాల్గొన్నారు.

గిరిజనుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టొద్దు

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలిగించాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, అదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపురావుతో పాటు మరికొంత మంది కలిసి సుప్రీంకోర్టులో పిటీషన్‌వేయడాన్ని ఖండిస్తున్నామని బంజార అడ్వకేట్ జేఏసీ నాయకులు హరినాయక్ పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజన తెగల మధ్య వైరాన్ని పెంచే విధంగాపాలకులు చేస్తున్నారని విమర్శించారు. దీనిపై ప్రభుత్వం స్పందించి వెంకటరావుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసమావేశంలో బానోతు కిషన్ నాయక్, ధరావత్ వీరన్న నాయక్, ప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ సంక్షేమం

- మేయర్ పునుకొల్లు నీరజ
- 23, 51, 52 డివిజన్లలో ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు పంపిణీ

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అర్హత కలిగిన ప్రతీ లబ్ధిదారుడికి దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని 23, 51, 52 డివిజన్లలో మేయర్ పర్యటించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు పత్రాలను లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి పంపిణీ చేశారు. ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. డిప్యూటీ మేయర్ పాతిమాజోహారా, కార్పొరేటర్లు రాపర్తి శరత్‌కుమార్, నాయకులు శెట్టి రంగారావు పాల్గొన్నారు.



పత్రాలు పంపిణీ చేస్తున్న మేయర్ నీరజ

నూతన విద్యుత్ లైన్ ప్రారంభం

పది గ్రామాలకు మెరుగైన కరెంట్

కల్లూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని బత్తుపల్లి గ్రామంలోని విద్యుత్ ఉపకేంద్రంలో రూ. 33 లక్షల అంచనాతో నిర్మించిన 33 కె. వి లైనును జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనుగుల శ్రీనివాసచారి మంగళవారం ప్రారంభించారు. కొత్తగా ఏర్పాటు చేసిన 33 కె. వి లైనుతో 33/11 కె.వి బత్తుపల్లి విద్యుత్ ఉపకేంద్రము పరిధిలోని పది గ్రామాలకు సంబంధించి ఇక విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదన్నారు. సుమారు 3వేల మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో లోఓల్టేజి మెరుగు పడుతుందన్నారు. వినియోగదారులకు మెరుగైన విధంగా విద్యుత్ సరఫరా చేయటమే సంస్థ ధ్యేయంగా పెట్టుకుందన్నారు. సత్తుపల్లి విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ లునావత్ రాములు, కల్లూరు సహాయక ఇంజనీర్ పి వెంకట్ సిబ్బందిలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

పెనుబల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందించాలని అప్పుడే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ కల్లూరు సీడీపీవో నిర్మలజ్యోతి అన్నారు. మంగళవారం పెనుబల్లి సెక్టార్ పరిధిలోని టేకులపల్లిలో జరిగిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. తల్లిపాలు రెండు సంవత్సరాలపాటు బిడ్డకు పట్టించడం వల్లనే పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తవని, తల్లులు కూడా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో తల్లులు పిల్లలకు పాలు ఇవ్వడానికి అయిష్టత చూపిస్తున్నారని దానివలన పిల్లలకే కాకుండా తల్లులు కూడా అనారోగ్యపాలవుతారన్నారు. అంగన్‌వాడీ టీచర్లు వెంకటపద్మ, రత్నకుమారి, విజయలక్ష్మీ, హెల్పర్లు సీతారావమ్మ, పద్మ, భూషమ్మ, శ్రీలక్ష్మీ, ఆశకార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

» జాజిరి శ్రీనివాసరావు

పెనుబల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులకు పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనాలు అమలు జీవోను సవరించాలని తెలంగాణ వ్యకా.సం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆ సంఘం సత్తుపల్లి డివిజన్ ముఖ్యకార్యకర్తల సమావేశం మంగళవారం వీఎంబంజర్‌లో జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 1948 కనీస వేతన చట్టం ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకోసారి పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతన జీవోను సవరించాలన్నారు. రెండు సంవత్సరాలకు ఒకసారి పెరిగిన ధరలు సామాజిక, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా సవరించాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 12సంవత్సరాల కాలంలో వ్యవసాయ కార్మికులకు కనీస వేతన జీవోను సవరణ చేయలేదన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు, నాయకులు తన్నీరు కృష్ణార్జున్‌రావు, గాయం తిరుపతిరావు, చమటా విశ్వనాథం, కువ్వారపు లక్ష్మణ్‌రావు, రామారావు, పులి కృష్ణయ్య పాల్గొన్నారు.

మహిళలకు ఆత్మీయ భరోసా ఏదీ?

» కూలీలందరికీ రూ.12వేలు అందించాలి

మధిర రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12వేలు అందించాలని సీపీఐ అనుబంధ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ కార్మికుల సమస్యలపై సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబుతో కలిసి మధిర డిప్యూటీ తహసీల్దార్‌కు ఒక వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీలో పనిచేసిన వారే అర్హులనే ప్రభుత్వ నిబంధనలను ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ కార్మికులకు 50సంవత్సరాలు దాటితే రూ.ఆరువేల వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య పెన్షన్ రూ.4వేలు, దివ్యాంగులకు రూ.ఆరువేలకు పెంచుతామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, సహజ, అసహజ ప్రమాదాలకు గురై మరణించిన వ్యవసాయ కార్మికులకు రూ.ఐదులక్షలు చెల్లించే విధంగా బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, నాయకులు మంగళగిరి రామాంజనేయులు, తలారి రమేష్, జల్లా బ్రహ్మం, అన్నవరపు సత్యనారాయణ, షన్నవల్లి అప్పారావు, నర్సింహారావు పాల్గొన్నారు.

చింతకాని, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భూమిలేని వ్యవసాయ కార్మిక మహిళలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు ఇవ్వాలని వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి సింగారపు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, గోగుల ఆదినారాయణ, షేక్ దస్తగిరి, పెద్ద వెంకటి, అమరయ్య, రాజేష్, శ్రీను పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సెల్‌ఫోన్ అప్పగించిన ఎస్ఐ

వైరా, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఐదునెలల కిందట పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి వైరా ఎస్ఐ పి.రామారావు మంగళవారం అందజేశారు. వైరా మునిసిపాలిటీ ఐదోవార్డుకు చెందిన విశ్రాంత ఏఎస్‌డబ్ల్యూ కురుగుంట్ల శ్రీనివాసరావు ఈ ఏడాది ఏప్రిల్‌లో పాత కూరగాయల మార్కెట్ వద్ద తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల విచారణలో భాగంగా సెల్‌ఫోన్‌ను రికవరీ చేసిన అనంతరం బాధితుడు శ్రీనివాసరావుకు ఎస్ఐ అందజేశారు. ఎస్ఐకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ రామారావు

గెస్ట్ అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏన్కూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైరా జనరల్ బాలికల గురుకుల విద్యాలయంలో బయోసైన్స్ గెస్ట్ ఉపాధ్యాయ పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కన్వీనర్ టి.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు నేటి నుంచి 8వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని , డెమో 9న నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తులు, డెమోలు ఏన్కూరు గురుకుల పాఠశాలలో జరుగుతాయని తెలిపారు. డెమో, బోధన అనుభవం ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఇంగ్లీష్ మీడియంలో బోధించాలని తెలిపారు.

మోదీపాలనలోనే దేశాభివృద్ధి

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలోనే దేశాభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని మెదక్ జిల్లా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం పరిణిత అన్నారు. ఘర్ ఘర్ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె మండలంలోని బేతుపల్లిలో పర్యటించి బీజేపీ పథకాలను ఇంటింటికి ప్రచారం చేశారు. నాడు బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్నాయని ఇదే విషయాన్ని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, ఈవీ.రమేష్, పుల్లారావు యాదవ్, నాయుడు రాఘవరావు, పాలకొల్లు శ్రీను, రోజా, పాకనాటి హరిబాబు, మునుగొండ స్రవంతి, శివ, నాగస్వామి, మట్టా ప్రసాద్, సాయి, ఆంజనేయులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ లైన్ ప్రారంభం

» రూ.33 లక్షల అంచనాతో

» పది గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా

కల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని బత్తుపల్లి గ్రామంలోని విద్యుత్ ఉపకేంద్రంలో రూ. 33 లక్షల అంచనాతో నిర్మించిన 33 కె. వి లైనును జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనుగుల శ్రీనివాసచారి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన 33 కె. వి లైనుతో 33/11 కె. వి బత్తుపల్లి విద్యుత్ ఉపకేంద్రము పరిధిలోని పది గ్రామాలకు సంబంధించి ఇక విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండదన్నారు. సుమారు 3 వేల మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో లోఓల్టేజి మెరుగు పడుతుందన్నారు. వినియోగదారులకు మెరుగైన విధంగా విద్యుత్ సరఫరా చేయటమే సంస్థ ధ్యేయంగా పెట్టుకుందన్నారు. సత్తుపల్లి విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ లునావత్ రాములు, కల్లూరు సహాయక ఇంజనీర్ పి వెంకట్ సిబ్బందిలు పాల్గొన్నారు.



లైన్ ప్రారంభంలో పాల్గొన్న అధికారులు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ఏన్కూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి తెలిఆరు.మంగళవారం నాచారం సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. గతకొన్నేళ్ల నుండి నాచారం, రేపల్లెవాడ ఫీడర్లు కలిసి ఉండడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని, ఈ అంతరాయాన్ని అధిగమించేందుకు నాచారం, రేపల్లేవాడీ ఫీడర్లను వేర్వేరుగా చేసినట్టు తెలిపారు ఈకార్యక్రమంలో డీఈ ఎల్.రాములు, ఏఈ ఉమాకాంత్, సబ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాల అమలేదీ?

కొణిజర్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల అమలేదని, ప్రతి వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల వ.కా.స, సీపీఐ మండల కమిటి ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రాముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు పిట్టల రాంబాబు, సీపీఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాసా వెంకటేశ్వరావు, గడల శ్రీనివాసరావు, చింతల మల్లయ్య, వెంకటి, వెంకయ్య, లక్ష్మయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా వాడకంతో మొక్కకు అధిక పోషకాలు

» జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

మధిర రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా, నానో డీఏపీ వాడకంతో మొక్కకు పోషకాలు అధిక మోతాదులో అందుతాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ధనసరి పుల్లయ్య రైతులకు సూచించారు. మంగళవారం మధిర మండలం ఆత్కూరు గ్రామంలో పత్తి పంటను పరిశీలించి నానో యూరియా, డీఏపీ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానో యూరియా వాడకం వల్ల పర్యావరణ కాలుష్యం తక్కువగా ఉంటుందన్నారు. నానో యూరియాను ఎంపిక చేసిన కలుపు మందులతో కలిపి పిచికారి చేయాలన్నారు. రసం పీల్చే పురుగుల నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు ఎకరాకు 8నుంచి 10 పెట్టుకోవాలని, ఉధృతిని బట్టి పురుగు మందులను వేప నూనెతో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి కె.సాయిదీక్షిత్, ఏఈవో టి.జిష్ణు, రైతులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న పుల్లయ్య

నానో యూరియానే వాడాలి ఏవో సరిత

ముదిగొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియా, నానోడీఏపీ వాడకానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని వ్యవసాయ అధికారిణి సరిత సూచించారు. మంగళవారం ముదిగొండ మండలంలోని పమ్మి, మాధాపురం, బాణాపురం, చిరుమర్రి, ముదిగొండ గ్రామాల్లో పలురకాల పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు నానోయూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఏఈవోలు మౌనిక, హిందు భవాని, లిఖిత, రఘు, నాగూల్‌మీరా, రైతులు పాల్గొన్నారు.

చట్ట ప్రకారం వేతనాలు చెల్లించాలి

» ఏఐటీయూసీ నాయకుల డిమాండ్

కల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన కల్లూరు మునిసిపాలటి కార్మికులకు మున్సిపాలిటి చట్టాల ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్ల ప్రధాన కార్యదర్శి తోట రామాఅంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండు చేస్తు కమిషనర్ సంపత్‌కుమార్‌కు కార్మికుల తరుపున మంగళవారం వినతి పత్రం అందించారు. కార్మికులకు గ్లౌజులు, బూట్లు వంటి సేఫ్టీ కిట్స్ అందించాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలని అన్నారు. ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ, వేము రాంబాబు, జిల్లా నాయకులు దామాల దయాకర్, కార్మిక సంఘం నాయకులు ఊడల కృష్ణమూర్తి, ఎస్‌డి వజీర్‌మీయా, శ్రీను, జయమ్మ, వేము చార్లేస్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు వెంకయ్య

కొణిజర్ల,ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన ఆదర్శ కమ్యూనిస్టు యోధుడు దొండపాటి వెంకయ్య అని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు కొనియాడారు. మంగళవారం కొణిజర్లలో స్వర్ణ రమేష్ అధ్యక్షతన జరిగిన దొండపాటి వెంకయ్య 47వ వర్ధంతిసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, దొండపాటి రమేష్, తోట రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పివిరావు, తోటపల్లి సీతరాములు, గొడ్డుగర్ల శ్రీను, సీపీఎం నాయకులు కొప్పుల కృష్ణయ్య, దొండపాటి వెంకయ్య కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోడేపూడికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వైరా, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దివంగత ఉమ్మడి సీపీఎం శాసనసభా పక్ష నేత బోడేపూడి వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా మంగళవారం తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు బాణాల శ్రీనివాసరావు, చింతనిప్పు చలపతిరావు, మచ్చా మణి, మల్లెంపాటి వీరభద్రరావు, కిలారు శ్రీనివాసరావు, వెంపటి రాజా, ఆళ్ల శ్రీనివాస్, చంద్ర ప్రసాద్, నల్లమోతు రాజాబాబు, కంచల శ్రీనివాసరావు పాల్గొన్నారు. అదేవిధంగా వైరా, ఖానాపురం, విప్పలమడక, గన్నవరం, లింగన్నపాలెం, అష్టగుర్తి, వల్లాపురం, పాలడుగు, కొండకొడిమ గ్రామాల్లో కూడా బోడేపూడి వర్ధంతి వేడుకలు నిర్వహించారు.

బోనకల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ మధిర ఎమ్మెల్యే బోడేపూడి 28వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు బందం శ్రీనివాసరావు, మచ్చా గురవయ్య, గుగులోతు నరేష్, బంకా శ్రీను, సంజీవులు, ఉప్పర శ్రీను, బాబు పాల్గొన్నారు.

తల్లాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీరు అందించేందుకు చేపట్టిన బోడేపుడి సుజల స్రవతి పథకం ఆదర్శంగా నిలిచిందని సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు అన్నారు. మంగళవారం బోడేపుడి వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సీపీఎం మండల నాయకులు నల్లమోతు మోహనరావు, తమ్మిశెట్టి శ్రీనివాసరావు, నాగమణి, గుంటుపల్లి వెంకటయ్య, చల్లా నాగేశ్వరరావు, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

మధిర రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మధిర ఎమ్మెల్యేగా దివంగత నేత బోడేపూడి వెంకటేశ్వరరావు మధిర ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, మధిర అభివృద్ధికి పెద్దపీట వేశారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. మంగళవారం మధిరలో బోడేపూడి వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. శీలం నర్సింహారావు, మందా సైదులు, చింతలచెర్వు కోటేశ్వరరావు, పాపినేని రాంనర్సయ్య, పడకంటి మురళీ, మద్దాల ప్రభాకర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

కల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం కమ్యూనిస్టు యోధుడు స్వర్గీయ బోడేపూడి వెంకటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సీపీఎం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటైన బోడేపూడి వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. బోడేపూడి నడిచిన బాటలో నేటి కమ్యూనిస్టులు ముందుకు సాగాలని వారు పిలుపు నిచ్చారు. ఐద్వా మండల కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు డి పుల్లయ్య, క్రాంతికుమార్, మట్టా వెంకటకృష్ణనాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దాతలు

మధిర, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, లైఫ్ ఆఫ్ గివింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆస్పత్రి సూపరిండెంట్ డా.అనిల్ కుమార్ ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి ఎటువంటి నష్టం ఉండదని రక్తదానంపై అపోహలు వీడాలని తెలిపారు. రక్తదానం చేయడానికి వచ్చిన వారికి ఖమ్మం రెడ్‌క్రాస్ సొసైటీ వారు కూల్‌డ్రింక్స్, పండ్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జైదాసు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ తౌరియ, ఫౌండేషన్ చైర్మన్ ఫైమాన్, రెడ్‌క్రాస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సూర్యప్రకాశరావు, కుంచం కృష్ణారావు, జల్లా వెంకటేశ్వర్లు, డేనియల్ రాజు పాల్గొన్నారు.

కరాటే, ఫైటింగ్ పోటీల్లో వాణీ వివేకానంద విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వాణి

వైరా, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో జరిగిన జిల్లాస్థాయి కరాటే, ఫైటింగ్ పోటీల్లో స్థానిక వాణీ వివేకానంద విద్యాలయం విద్యార్థులు ప్రతిభను చాటారు. వాణీ వివేకానంద విద్యాలయానికి చెందిన జి.కోమలి(నాల్గోతరగతి), జి.మనస్వీ(మూడోతరగతి), జి.దుర్గాదీక్షిత(రెండోతరగతి) ఈ పోటీల్లో మొదటి, ద్వితీయ బహుమతులు సాధించారు. పోటీల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ చుండూరి వాణీ అభినందించారు.

అనారోగ్య బాధితుడికి రూ.2లక్షల సాయం



కృష్ణారెడ్డికి చెక్కును అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

తల్లాడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్నవల్లి గ్రామానికి చెందిన శీలం కృష్ణారెడ్డి అరుదైన ఎంఎన్డీ వ్యాధితో బాధపడుతుండగా తెలంగాణ ప్రభుత్వ రెడ్డి ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన చికిత్స కోసం రూ.2లక్షల ఆర్థికసాయం అందించారు. ఆటోడ్రైవర్‌గా కుటుంబాన్ని పోషిస్తున్న కృష్ణారెడ్డికి మూడేళ్ల క్రితం లక్షలాది మందిలో ఒకరికి వచ్చే అరుదైన ఎంఎన్డీ వ్యాధి వచ్చింది. వైద్యఖర్చుల కోసం ఇప్పటి వరకు రూ.10లక్షలు ఖర్చుచేశారు. ప్రతినెలా రూ.10వేలు మందులకు పోషకాహారం కోసంఖర్చు అవుతుంది. ఈవిషయం తెలుసుకున్న తెలంగాణ ప్రభుత్వ రెడ్డి ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు మానవతా దృక్పథంతో స్పందించి రూ.2లక్షలు ఆర్థికసహాయం అందించారు. అసోసియేషన్ నాయకులు బొగ్గుల వెంకటరామిరెడ్డి, మాధవరెడ్డి, రఘుపతిరెడ్డి, వై.శ్రీకాంత్‌రెడ్డి, ప్రతీష్‌రెడ్డి, అజిత్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, అయిలూరి వెంకటకోటారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శీలం సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి

» డీఎంహెచ్‌వో కళావతిబాయి

మధిర రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేవిధంగా వైద్యసిబ్బంది కృషిచేయాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ బాణోతు కళావతిబాయి సూచించారు. మంగళవారం మధిర మండలం దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో గర్భిణీల నమోదులు నిర్వహించాలని, వారికి సంపూర్ణ ఆరోగ్య సేవలందించి కాన్పుల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవిధంగా చైతన్యపర్చాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం మహదేవపురంలో దాతలు పుతుంబాక రామసీతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు పుతుంబాక సుభాష్, వారి బ్రదర్స్ రూ.25లక్షల ఆర్థిక సహకారంతో నిర్మిస్తున్న పల్లె దవాఖానా భవనాన్ని ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యులు డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్, చెరుకూరి దివ్య శృతి, వైద్యసిబ్బంది వి.వెంకటేశ్వర్లు, లంకా కొండయ్య పాల్గొన్నారు.

బోనకల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండ ముందస్తుగా ప్రణాళికలను రూపొందించుకుని, పకడ్బందీగా సేవలందించాలని డీఎండ్‌హెచ్‌వో బి. కళావతిబాయి సూచించారు. బోనకల్ పీహెచ్‌సీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం జరిగిన ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది సమావేశంలో ఆమె పాల్గొని పలు సూచనలు చేశారు. గ్రామాలల్లో జ్వరాల సర్వేను చేపట్టి రికార్డులో నమోదు చేయాలన్నారు. వైద్యాధికారి స్రవంతి, సూపర్‌వైజర్ ధానయ్య, స్వర్ణలత, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన దయానంద్

కల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల వసతి గృహాన్ని మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌తోపాటుగా కాంగ్రెస్ ప్రతినిధి బృందం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో ఆహారం లోపంతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దయానంద్ వసతి గృహంలో విద్యార్థినులను పరామర్శించారు. అంతకు ముందు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న బాలికలను మనోధైర్యం కల్పించారు. ఆసుపత్రిలో వారికి కావాల్సిన వసతి సదుపాయాలను ఏర్పాటు చేయాలని సిబ్బందిని కోరారు. వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు. విద్యార్థినులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఆహార తయారిలో ఎలాంటి లోపాలు జరిగిన బాధ్యులైన వారిపై చర్యలు తప్పవన్నారు. విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన వారిలో తహసిల్దార్ పి సాంబశివుడు, ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, తక్కెళ్లపాటి ప్రసాద్, పోట్రు అర్జునరావు, ఏనుగు సత్యంబాబు, పెద్దబోయన శ్రీనువాసరావు, సిపిఐ మండల కార్యదర్శి దమాల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దయానంద్

భావితరాల కోసం మొక్కలు నాటి పెంచుదాం

సత్తుపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భావితరాల మనుగడ కోసం మొక్కలను నాటి పెంచాల్సిన బాధ్యత ఉందని, పచ్చదనం పెంపొందించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా మంగళవారం కమిషనర్ కె.నరసింహతో కలిసి మొక్కలు నాటారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, శివా వేణు, గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషా, పోతురాజు కిషోర్, గఫార్ ఖాన్, కొప్పుల నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా బేతుపల్లి పెద్ద చెరువు కాలువలు

» పేరుకుపోయిన పూడిక, పెరిగిన పిచ్చి మొక్కలు

» పారుదలకు అడ్డంకి

» నీరు వదిలితే పోటెత్తి గట్లపై నుంచి వరి పైరు మునక

సత్తుపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువు కాలువలలో పూడిక పేరుకొని, పిచ్చి మొక్కలతో నీటి ప్రవాహనికి ఇబ్బందిగా మారింది. బేతుపల్లి పెద్ద చెరువు కింద అధికారికంగా 4800 ఆయకట్టు ఉంది. అనధికారికంగా మరో రెండు వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. బేతుపల్లి, తాళ్లమడ, కిష్టాపురం, తుంబూరు గ్రామాల్లో భూములకు సాగు నీరు అందుతుంది. కుడి, ఎడమ కాలువలు విస్తరించి ఉన్నాయి. బేతుపల్లి ప్రాంతంలో సాగు నీరు పారాల్సిన కాలువలు సక్రమంగా లేకపోవడంతో సాగు నీరు సక్రమంగా ప్రవహించని పరిస్థితి ఉంది. సాగునీరు విడుదల చేసిన సమయంలో కాలువల్లో పిచ్చి మొక్కలు, పూడిక కారణంగా సాగునీరు పోటెత్తి గట్టపై నుంచి నీరు వరి పొలాల్లోకి చేరుతోంది. పెద్ద మొత్తంలో కాలువ గట్లపై నుంచి సాగునీరు బేతుపల్లి సమీపంలో వరి పొలాల్లోకి చేరుతుండడంతో కొందరు రైతుల వరి పైరు నీట మునిగి కుళ్లిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలువలకు వెంటనే మరమ్మతులు చేసి బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు.



కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు



నీట మునిగిన వరి పైరు

ఎరువుల దుకాణాల తనిఖీ

చింతకాని, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొదుమూరు, నాగులవంచ, చింతకానిల్లో ఎరువుల దుకాణాలను ఏడీఏ విజయచంద్ర తనఖీ చేశారు. రికార్డులు, స్టాక్ బోర్డులు, బిల్ బుక్స్‌ను పరిశీలించారు. ఘన యూరియా వినియోగం తగ్గించి నానో యూరియాను వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏవో మానస, ఏఈవోలు పాల్గొన్నారు.



స్టాక్ బోర్డును పరిశీలిస్తున్న ఏడీఏ